గురువారం
26-05-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 332
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా స్కూలులో కాల్పులు: 19 మంది మృతి

అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. మెక్సికన్ సరిహద్దులోని ఉవాల్డేలో పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. టెక్సాస్‌లో రాబ్ ఎలిమెంటరీ స్కూల్‌లో దుండగుడు విద్యార్థులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో మొత్తం 21 మంది మృతి చెందారు. 2లో

పోలీస్ గుప్పిట కోనసీమ

- సడలని ఉద్రిక్తత
- అల్లర్ల సూత్రధారి అరెస్టు?
- రావులపాలెంలో ర్యాలీకి ఆందోళనకారుల యత్నం
- నిలువరించిన పోలీసులు
- ఎస్పీ వాహనంపై రాళ్లు

విశాలాంధ్ర-రావులపాలెం/అమలాపురం: కోనసీమలో జిల్లా పేరును యథాతథంగా కొనసాగించాలని కోరుతూ కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కోనసీమ జిల్లా సాధన సమితి సభ్యులు ర్యాలీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో మళ్లీ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పట్టణంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. అమలాపురం ఘటన నేపథ్యంలో ముందుగానే అప్రమత్తమైన పోలీసులు ఎక్కడివారిని అక్కడే నియంత్రించారు. ఎవరు కూడా నిరసన కార్యక్రమాలలో పాల్గొనకుండా ఆంక్షలు విధించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అధ్వర్యంలో దాదాపు 300 మంది పోలీసులు పట్టణంలో బందోబస్తు చేపట్టారు. అయితే కోనసీమ సాధన సమితి సభ్యులు వినతి పత్రం ఇచ్చేందుకు ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిని నిలువరించారు. కొందరు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బందోబస్తులో భాగంగా పట్టణంలోని పరిస్థితిని - మిగతా 2 లో

కార్చిచ్చుకు కారణమెవరు?

ప్రభుత్వ వైఖరి వల్లే కోనసీమలో అశాంతి : సీపీఐ కార్యదర్శి నారాయణ 3లో

- అధికారపార్టీ కుట్రేనంటున్న విపక్షాలు
- జనసేన, టీడీపీ వల్లే విధ్వంసం జరిగిందన్న అధికారపక్షం
- ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలవల్లేనన్న బాధితులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి అందాలకు, ఆతిథ్యానికి దేశంలోనే పేరెన్నికగన్న కోనసీమ రాజకీయ కుట్రకు వేదికగా మారడం రాష్ట్ర ప్రజలను ఆవేదనకు గురి చేస్తోంది. సున్నిత అంశాలపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంత ప్రమాదం వాటిల్లుతుందో అమలాపురం అల్లర్లే నిదర్శనం. ప్రభుత్వం ఏమాత్రం జాగ్రత్త చర్యలు తీసుకున్నా ఈ సమస్య సునాయాసంగా పరిష్కారమయ్యేది. ఎందుకంటే భారత రాజ్యాంగ నిర్మాత, భరత జాతి మొత్తం గౌరవించే మహానేత అంబేద్కర్ పేరును ఎవరూ వ్యతిరేకించరు. కేవలం ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలు, తామేం చేసినా చెల్లుబాటు అవుతుందనే అధికార అహంభావం, ప్రతిపక్షాలంటే చులకనభావమే కోనసీమ కార్చిచ్చుకు ప్రధాన కారణాలని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆన్‌లైన్ మంత్రివర్గ సమావేశంలో అర్థాంతరంగా తీసుకున్న కొత్త జిల్లాల విభజన నిర్ణయంపై ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు అమలాపురం ఘటనే ఉదాహరణ. ఏప్రిల్ 4వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల పాలన ప్రారంభించింది. ఆలోపే జిల్లాల పేర్లు మార్పు, సరిహద్దు సమస్యలు, ఇతర అంశాలపై ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ సందర్భంగా కోనసీమ జిల్లాకు అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేయాలని ఆ ప్రాంత వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే కోనసీమ జిల్లాగానే ఉంచాలని మరికొందరు విజ్ఞాపనలు అందజేశారు. అలాగే దాదాపు ప్రతి జిల్లాలోనూ భిన్నమైన వాదనలు, వినతులు వచ్చాయి. ఉదాహరణకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్వగ్రామం నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉండగా, దానికి ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేయగా, విజయవాడ పార్లమెంటుకి ఎన్టీఆర్ జిల్లాగా నామకరణం చేశారు. అలాగే సీఎం సొంత జిల్లా అయిన కడప పేరును ఏకపక్షంగా తొలగించారు. ఏపీకి తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలన్న విజ్ఞప్తులూ బుట్టదాఖలు చేశారు. అదేవిధంగా ప్రతి జిల్లాలోనూ ప్రజలకు ప్రత్యక్షంగా ఇబ్బందులు కలగజేసే అంశాలను సైతం ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్త జిల్లాల గెజిట్‌ను విడుదల చేశారు. అయినా ప్రజలు బహిరంగంగా ఎక్కడా ఆందోళనలు - మిగతా 2 లో

సామాజిక న్యాయం లేదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన జగదీశ్, జాఫర్, నారాయణ స్వామి తదితరులు

- పేద ప్రజలకు రక్షణ కరవు
- అధికారం లేని డమ్మీ మంత్రులు
- జగన్ ఏకపక్ష వైఖరి వల్లే అంబేద్కర్ పేరు వివాదం
- వైసీపీ పాలనకు వ్యతిరేకంగా 2న చలో రాజ్ భవన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

2లో

కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బ

- కపిల్ సిబల్ రాజీనామా
- ఎస్పీ మద్దతుతో రాజ్యసభకు నామినేషన్

లక్నో : సంస్కరణ బాట పట్టినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. కీలక నాయకులు ఒక్కొక్కరు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. తాజాగా మూడు దశాబ్దాల అనుబంధంగల నేత కపిల్ సిబల్ కూడా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేశారు. గత వారమే పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన బుధవారం ప్రకటించారు. రాజ్యసభకు పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా ఎగువ సభకు పోటీ చేయబోతున్నారు. కేంద్ర మాజీ మంత్రి సిబల్ ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, రామ్ గోపాల్ యాదవ్, ఇతర సీనియర్ నేతలతో కలిసి నామినేషన్ పత్రాలను ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఆవరణకు వెళ్లి సమర్పించారు. కాంగ్రెస్ (రాజ్యసభ) ఎంపీగా సిబల్ పదవీకాలం జులైలో పూర్తికానుంది. ఆయన జీ23 నేతల్లో ఒకరు. సిబల్ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశానని చెప్పారు. తనకు మద్దతిచ్చినందుకు అఖిలేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 16నే కాంగ్రెస్‌కు రాజీనామా చేశానని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడిని కానన్నారు. '30-31ఏళ్ల అనుబంధం ఉన్న పార్టీని వీడటం చిన్న విషయం కాదు. రాజీవ్‌గాంధీ వల్ల కాంగ్రెస్‌లో చేరాను. 31ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానంటే అందుకు కారణం లేకపోలేదు. కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తప్పవు. నా సిద్ధాంతాలు, భావజాలం ఇప్పటికీ కాంగ్రెస్‌తోనే ముడిపడి ఉన్నాయి. కాంగ్రెస్‌కు దాని సిద్ధాంతాలకు దూరంగా లేను. పార్టీ భావాలే నాలో జీర్ణించుకొని ఉన్నాయి. సభ్యులుగా పార్టీ పట్ల నిబద్ధతతో, క్రమశిక్షణగా వ్యవహరించడం కోసం కట్టుబడి ఉంటాంగానీ స్వేచ్ఛగా మాట్లాడటం కూడా ముఖ్యం. స్వతంత్రంగా మాట్లాడితే ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని ప్రజలు నమ్ముతారు' అని సిబల్ అన్నారు. సంకీర్ణాన్ని ఏర్పాటు చేయాలని, బీజేపీ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించడం కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. తనది ఎస్పీ భావజాలమేమీ కాదని కలుపుకొని పోయే భావజాలాన్ని సమర్థిస్తాననీ, అది ఎస్పీ, ఆర్ఎల్‌డీ లేదా టీఎంసీ, డీఎంకే కావచ్చు అని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఇటీవల సునీల్ ఝాకర్, హార్దిక్ - మిగతా 2 లో

యాసిన్ మాలిక్‌కు జీవితఖైదు

- పది నేరాలకుగాను పదేళ్ల కఠిన కారాగారం
- రూ.10 లక్షల జరిమానా
- మరణం వరకు వరుసగా శిక్షల అమలు : ఢిల్లీ కోర్టు తీర్పు
- ఉరిశిక్ష విధించాలన్న ఎన్ఐఏ
- క్షమాభిక్ష కోరనన్న మాలిక్

న్యూఢిల్లీ : ఉగ్ర నిధుల కేసులో కశ్మీర్ నేత యాసిన్ మాలిక్‌కు రెండు యావజ్జీవ శిక్షలు విధిస్తూ ఢిల్లీ న్యాయస్థానం తీర్పునిచ్చింది. అలాగే పది నేరాలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10లక్షల జరిమానానూ విధించింది. అన్ని శిక్షలు ఒకదాని తర్వాత ఒకటిగా మాలిక్ మరణం - మిగతా 2 లో

నేటి నుంచి ప్రజానాట్యమండలి కళా ఉత్సవాలు

సిద్ధమైన కడప

- భారీ ర్యాలీతో ప్రారంభం... 29న ముగింపు
- హాజరుకానున్న వివిధ జిల్లాల కళాకారులు, సినీ దర్శకులు

విశాలాంధ్ర బ్యూరో - కడప: తెలుగునాట సాహితీ, కళా సంస్కృతుల పరిమళాలు వెదజల్లిన కడప జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర 10వ మహాసభలు, కళా ఉత్సవాల నిర్వహణకు కడప నగరం ముస్తాబైంది. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నగరాన్ని స్వాగత ద్వారాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరించారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరం (కమ్మసాహెబ్ శ్యామలాదేవి ప్రాంగణం), నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రం (మాదాల రంగారావు కళా ప్రాంగణం)లో - మిగతా 2 లో

హిందూస్థాన్ జింక్ ప్రైవేటీకరణ

- 29.5 శాతం వాటా విక్రయానికి సీసీఈఏ ఆమోదం
- రూ.38 వేల కోట్లు ఆర్జించనున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ : ప్రజావ్యతిరేకతను, ఎల్ఐసీ ఐపీఓలో వ్యక్తమైన నిరాశక్తతను ఏమాత్రం లెక్కచేయకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను మొండిగా వేగవంతం చేస్తోంది. తాజాగా హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్)లో - మిగతా 2 లో

జూన్ 23న ఆత్మకూరు ఉపఎన్నిక

- ఆరు రాష్ట్రాల్లో 3 లోక్‌సభ, 6 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- షెడ్యూలు విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఏపీలో ప్రస్తుతం రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. రాజ్యసభ ఎన్నికలు ముగియగానే... రాష్ట్రంలో మరో ఉప ఎన్నికకు నగారా మోగనుంది. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఇటీవల రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణంతో ఖాళీ అయిన నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఈసీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు ఈ నెల 30న నోటిఫికేషన్ జారీ కానుంది. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి జూన్ - మిగతా 2 లో

యూనికార్న్ స్టార్టప్ హబ్‌గా విశాఖ

దావోస్‌లో సీఎం జగన్ వరుస సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యూనికార్న్ స్టార్టప్స్ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వివిధ స్టార్టప్స్‌కు చెందిన వ్యవస్థాపకులు, సీఈవోలు, వీటికి సంబంధించిన ముఖ్య అధికారులతో దావోస్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఏపీలో స్టార్టప్స్ కంపెనీల ఏర్పాటు, వాటి అభివృద్ధిపై చర్చించారు. విశాఖపట్నం కేంద్రంగా స్టార్టప్స్ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం తెలిపారు. విధానపరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై వారితో సీఎం చర్చించారు. స్టార్టప్‌లు అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులు సమకూరుస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఏపీలో విద్యారంగానికి తోడుగా నిలుస్తామని బైజూస్ వైస్ ప్రెసిడెంట్, పబ్లిక్ పాలసీ సుష్మిత్ సర్కార్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యకు సంబంధించి పరిశోధక, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా బైజూస్ పాఠ్యప్రణాళికను ఏపీ విద్యార్థులకు అందిస్తామన్నారు. ఏపీలో సమగ్ర భూసర్వే, - మిగతా 2 లో

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా హైదరాబాద్ నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా ప్రధాని పర్యటన సందర్భంగా ఆయన వచ్చి వెళ్లే మార్గాలలో భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు సమీక్షించారు. అలాగే నగరంలో అనేక చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. ప్రధాని మోదీ గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని అధికారులు తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి విప్రో జంక్షన్ వరకు ఉన్న ఐటీ, ఇతర కంపెనీలు తమ కార్యాలయ సమయాలను మార్చుకోవాలని సూచించారు. ఈ మార్గాలలో వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు.

ఇదీ లోకం!

ఉండపయ్యా నీ గోల, అవతల ఈ దిక్కుమాలిన రోడ్లలో యాత్ర ఎలా చేయాలా? అని మా సారు టెన్షన్ పడుతుంటేనూ!

నలుగురు రాజ్యసభ అభ్యర్థులు నామినేషన్ల దాఖలు 2లో

ప్రగతి పనులు వేగవంతం చేయాలి 3లో

సీఎస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశం

శ్రీలంక ఆర్థికశాఖ బాధ్యతలు ప్రధానికే..

కొలంబో : అప్పుల ఊబిలో కూరుకున్న శ్రీలంక ఆర్థికమంత్రిగా ప్రధాని రణిల్ విక్రమసింఘే ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవడం, ఆ తర్వాత నెలకొన్న తీవ్ర పరిణామాల నేపథ్యంలో ప్రధానిగా కొనసాగిన మహింద రాజపక్స రాజీనామా చేయడంతో రణిల్ విక్రమసింఘే ప్రధాని బాధ్యతలు చేపట్టారు. దేశాధ్యక్షుడు గోటబాయ ఆయనకు ఆర్థికమంత్రి బాధ్యతలు కూడా అప్పచెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రణిల్ విక్రమ్ సింఘే ఐదుసారు ప్రధానిగా పని చేసిన అనుభవం ఉంది. ఈ నెల 12న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విక్రమసింఘే.. ఆ తర్వాత వివిధ దేశాలతో సంబంధాలను పెంపొందించేందుకు చొరవ చూపారు. తాజాగా శ్రీలంకలో ఆహారం, ఇంధనం, మందులు, వంటగ్యాస్, టాయిలెట్‌పేపర్ సహా అగ్గిపుల్లలకు సైతం తీవ్ర కొరత నెలకొంది.

ఇమ్రాన్ 'ఆజాదీ మార్చ్' హింసాత్మకం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పిలుపునిచ్చిన 'ఆజాదీ మార్చ్' బుధవారం హింసాత్మకంగా మారింది. పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులపై పోలీసులు భాష్పవాయువులు ప్రయోగించడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆ పార్టీ ర్యాలీని అడ్డుకునేందుకు వివిధ నగరాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని తోసుకుని కార్యకర్తలు ముందుకు రావడంతో సమీపంలోని ఎత్తైన భవనాలపై ఉన్న పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. పలు రోడ్లను బ్లాక్ చేసి, ఇమ్రాన్ ఖాన్ పార్టీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆ పార్టీ కార్యకర్తలు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ప్రధాని పదవి నుంచి బలవంతంగా తప్పుకున్న ఇమ్రాన్ ఖాన్, వెంటనే ఎన్నికల నిర్వహించేందుకు జాతీయ అసెంబ్లీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీని కోసం దేశంలోని వివిధ నగరాల నుంచి రాజధాని ఇస్లామాబాద్ వరకు 'ఆజాదీ మార్చ్'కు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష కూటమి నేతృత్వంలోని ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఇమ్రాన్ ఖాన్ డిమాండ్‌ను తిరస్కరించింది. ప్రజలను 'తప్పుదోవ పట్టించే ఎజెండాను' ప్రచారం చేయకుండా నిరోధించడానికి ఇమ్రాన్ పార్టీ ర్యాలీని నిషేధించింది. లాహోర్, రావల్పిండి, ఇస్లామాబాద్, కరాచీలో 144 సెక్షన్ విధించింది. శాంతి భద్రతలు అదుపుతప్పకుండా ఉండేందుకు పారామిలిటరీ సిబ్బందిని ప్రభుత్వం రంగంలోకి దించింది. పంజాబ్ రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి నాలుగు వేలకుపైగా పోలీసులను రాజధాని ఇస్లామాబాద్‌కు రప్పించింది. ఇమ్రాన్ ఖాన్ 'ఆజాదీ మార్చ్'ను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నది.

అమెరికా స్కూలులో కాల్పులు: 19మంది మృతి

టెక్సాస్: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. మెక్సికన్ సరిహద్దులోని ఉవాల్డేలో పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. టెక్సాస్‌లో రాబ్ ఎలిమెంటరీ స్కూల్‌లో దుండగుడు విద్యార్థులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో మొత్తం 21 మంది మృతి చెందారు. వీరిలో 19 మంది విద్యార్థులు కాగా ఇద్దరు అధ్యాపకులు. ఈ పాఠశాలలో మొత్తం 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. మృతిచెందిన విద్యార్థుల వయస్సు 4 నుంచి 11 ఏళ్ల మధ్య ఉంటుందని టెక్సాస్ గవర్నర్ గ్రేగ్ అబాట్ తెలిపారు. నిందితుడు ఉవాల్డే హైస్కూల్‌లో 18 ఏళ్ల విద్యార్థి సాల్వడార్ అమెస్‌గా తెలుస్తోంది. పోలీసుల కాల్పుల్లో దుండగుడు మృతి చెందినట్లు గవర్నర్ స్పష్టం చేశారు. కాల్పుల ఘటనకు ముందు.. తన బామ్మను చంపిన తర్వాతే వాహనంలో స్కూల్‌కు చేరుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం.

ఈ ఏడాది అమెరికాలో స్కూళ్ల కాల్పుల ఘటనలు 27 జరిగినట్లు తెలుస్తోంది. అమెరికాలో 2018 సంవత్సరం నుంచి స్కూళ్లల్లో కాల్పులు జరుగుతన్న ఘటనల గణాంకాలను ఎడ్యుకేషన్ వీక్ అనే సంస్థ నమోదుచేస్తోంది. ఈ సంస్థ డేటా ప్రకారం ఇప్పటి వరకు 2018 నుంచి 119 ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై దేశ అధ్యక్షుడు జో బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిజేశారు.

డీఎన్ఏ శ్యాంపిళ్ల సేకరణ

మృతిచెందిన చిన్నారుల మృతదేహాలు ప్రస్తుతం ఎస్ఎస్జీటీ విల్లీ డీ లియాన్ సివిక్ సెంటర్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఆ కేంద్రం వద్ద బాధిత బంధువులు తమ పిల్లల భౌతికదేహాల కోసం ఎదురుచూస్తున్నారు. పిల్లల తల్లితండ్రుల నుంచి డీఎన్ఏ శ్యాంపిళ్లను సేకరిస్తున్నారు. కాల్పుల్లో మృతిచెందిన పిల్లలతో ఉన్న రిలేషన్‌ను తేల్చేందుకు అధికారులు డీఎన్ఏ శ్యాంపిళ్లను తీసుకుంటున్నారు.

పోప్, జెలెన్‌స్కీ, జర్మనీ ఛాన్సలర్ నివాళి..

టెక్సాస్ కాల్పుల ఘటనలో చనిపోయిన వారి మృతుల కుటుంబాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నివాళి అర్పించారు. జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కల్జ్,

స్పెయిన్ ప్రధాని పెడ్రో షాంచేజ్ కూడా మృతుల కుటుంబాలకు నివాళి అర్పించారు. టెక్సాస్ ఘటనతో తన గుండె ముక్కలైనట్లు పోప్ ఫ్రాన్సిస్ తెలిపారు. గన్ నియంత్రణ చట్టాలను రూపొందించాలని ఆయన కోరారు. మళ్లీ ఇలాంటి విషాద ఘటనలు జరగకుండా చూడాలన్నారు. యూరోప్ దేశాలైన స్లోవేకియా, ఐర్లాండ్, ఫిన్‌లాండ్ కూడా నివాళి అర్పించాయి.

యాసిన్ మాలిక్‌కు జీవితఖైదు

(మొదటిపేజీ తరువాయి)

వరకు అమలు అవుతాయి అని కోర్టు పేర్కొంది. ఆయనకు ఎన్ఐఏ కోర్టు కూడా జరిమానా విధించింది. మాలిక్ విచారణ క్రమంలో కోర్టు వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అంతకుముందు కేసును వాదించిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మాలిక్‌కు మరణశిక్ష విధించాలని కోరింది. కశ్మీరీల వలసలకూ మాలిక్ కారణమని ఇన్‌చాంబర్ విచారణలో ప్రత్యేక న్యాయమూర్తి ప్రవీణ్ సింగ్‌కు ఏజెన్సీ తెలిపింది. కోర్టు ఏ శిక్ష అయినా విధించవచ్చునని, తాను క్షమాభిక్ష కోరనని మాలిక్ చెప్పినట్లున్లు వర్గాల సమాచారం. అయితే మాలిక్‌కు కనీస శిక్ష (యావజ్జీవం) విధించాలని ఆయన కోసం కోర్టు నియమించిన అమికస్ క్యూరి కోరారు. 28 ఏళ్లలో హింసకు పాల్పడినట్లుగానీ ఉగ్ర కార్యకలపాలతో ముడిపడి ఉన్నట్లుగానీ భారతీయ ఇంటెలిజెన్స్ నిరూపిస్తే రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని, ఉరికంబం ఎక్కుతానని మాలిక్ చెప్పినట్లు తెలిసింది. మాలిక్‌ను దోషిగా తేల్చిన క్రమంలో ఆయనకు ఇక అవకాశం లేదని న్యాయమూర్తి తెలిపారు. ఈనెల 19న మాలిక్‌ను దోషిగా తేల్చిన కోర్టు ఆయన ఆస్తి వివరాలను సేకరించాలని ఎన్ఐఏ అధికారులను ఆదేశించింది. వారి నివేదిక ఆధారంగా మాలిక్‌కు జరిమానా విధించనున్నట్లు తెలిపింది. ఇదిలావుంటే, కశ్మీర్ వేర్పాటువాద నేతలు ఫరూక్ అహ్మద్ దార్ అలియాస్ బిట్టా కరాటే, షబ్బీర్ షా, మషారత్ ఆలం, మహమ్మద్ యూసుఫ్ షా, అల్తాఫ్ అహ్మద్ షా, నయీం ఖాన్, అక్బర్ ఖాండే, రాజీ మెహరాజుద్దీన్ కల్వాల్, బషీర్ అహ్మద్ భట్, జహూర్ అహ్మద్ షా వతాలీ, షబ్బీర్ అహ్మద్ షా, అబ్దుల్ రషీద్ షేక్, నవల్ కిశోర్ కపూర్‌లపై ఆరోపణలనూ కోర్టు విచారిస్తోంది.

సిద్ధమైన కడప

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలు అలరించనున్నాయి. కార్యక్రమాలు జరిగే ప్రాంతంలోనూ, నగరంలోని అనేక కూడళ్లలో కళారూపాలను ఆవిష్కరించే విధంగా జండాలతో అలంకరించారు. కళాఉత్సవాల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పదకవితా పితామహుడు అన్నమయ్య, అల్లసాని పెద్దన, ధూర్జటి, నంది తిమ్మన ఇలా చెప్పుకుంటూ పోతే కళాకారులకు ఎంతో పేరుగాంచిన కడప జిల్లాలో మహాసభలు జరగడం జిల్లాకే గర్వించదగ్గ విషయం. గురువారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు, ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలతో పాటు సినీ నటులు, నిర్మాతలు, దర్శకులు పాల్గొననున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి కళాకారులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. ప్రతి రోజు ప్రతి జిల్లా నుంచి వచ్చే కళాకారులు గేయనృత్యరూపకం, వీధి నాటకాలు, తప్పెట గుళ్లు, కోలాటం, డప్పుల నృత్యంతో పాటు అనేక నాటికలను ప్రదర్శిస్తారు. ప్రతి రోజు కార్యక్రమాలలో ప్రముఖులు పాల్గొననున్నారు. 27న జరిగే కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ఇప్టా ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు సంజీవమ్మ వంటి ఉద్దండులు పాల్గొననున్నారు. మొదటి రోజు జిల్లా పరిషత్ ఆడిటోరియం నుంచి నేక్‌నామ్ ఖాన్ కళాక్షేత్రం వరకు కళాకారులతో అంగరంగ వైభవంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. 28వ తేదీ శనివారం జరిగే కార్యక్రమాలలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు విమలక్క పాల్గొననున్నారు. 29న ఆదివారం జరిగే కార్యక్రమాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం కావడానికి ఆహ్వానసంఘం విశేషంగా కృషి చేస్తోంది. కవులకు పుట్టినిల్లు అయిన కడప జిల్లాలో ఇలాంటి మహాసభలు జరగడం జిల్లా ప్రతిష్ఠకు గొప్ప విషయమనీ, కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల ఉన్న కళాకారులు పాల్గొని కడప ఫ్యాక్షన్ గడ్డే కాదు కవులకు, కళాకారులకు ఆదర్శనీయమైన జిల్లా అని చాటిచెప్పాలని మహాసభల ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

పటేల్ కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. సిబల్‌కు మద్దతివ్వడంపై అఖిలేశ్ యాదవ్ స్పందించారు. 'కపిల్ సిబల్ ప్రముఖ న్యాయవాది, సీనియర్ నాయకుడు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా ఉన్న వ్యక్తి. తన అభిప్రాయాన్ని ఎక్కడైనా నిరభ్యంతరంగా చెప్పగలిగినవారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సరిహద్దుల అభద్రతా, చైనా వంటి కీలక అంశాలపైనా ఆయన ప్రశ్నించగలరని భావిస్తున్నా' అని అన్నారు. మొత్తం 403 మంది ఉండే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ఎస్పీకి 111 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్లమెంటు ఎగువ సభకు ముగ్గురిని ఈ పార్టీ పంపగలదు. మిగతా ఇద్దరు అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని అఖిలేశ్ తెలిపారు. కాగా, బీజేపీకి అసెంబ్లీలో 255 మంది సభ్యులు ఉండగా రాజ్యసభకు ఎనిమిది మందిని పంపే అవకాశం ఆ పార్టీకి ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 11 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగన్నాయి.

నలుగురు రాజ్యసభ అభ్యర్థులు నామినేషన్ల దాఖలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యసభకు రాష్ట్రం నుంచి నలుగురు సభ్యుల ఎన్నికకు బుధవారం అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అమరావతి సచివాలయం అసెంబ్లీ భవనంలో రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర శాసన మండలి ఉప కార్యదర్శి పి.వి.సుబ్బారెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వరుసగా వి.విజయసాయిరెడ్డి, బీద మస్తాన్ రావు, ఎస్.నిరంజన్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ నలుగురు నామినేషన్ పత్రాలతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పొందిన 'బి' ఫారం, అఫిడవిట్, సెక్యూరిటీ డిపాజిట్ తదితర పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. రిటర్నింగ్ అధికారి పి.వి.సుబ్బారెడ్డి వీరి నామినేషన్ పత్రాలను పూర్తిగా పరిశీలించి, అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వారి వెంట ప్రభుత్వ (ప్రజావ్యవహారాల) సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రులు కె.నారాయణ స్వామి, అంజాద్ బాషా, మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున హాజరయ్యారు.

సామాజిక న్యాయం లేదు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కోనసీమ జిల్లా వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో బుధవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యుడు కేశవ రెడ్డితో కలసి రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏకపక్ష ధోరణి వల్ల రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి రావణ కష్టానికి దారితీశాయని విమర్శించారు. జిల్లాల విభజన, పేర్లు మార్పు వంటి కీలకమైన నిర్ణయాలు ప్రభుత్వమే అమలు చేయాల్సి ఉన్నా ప్రజాస్వామ్యబద్ధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు జిల్లాల పెంపును స్వాగతించాయన్నారు. అయితే సీఎం జగన్ రాష్ట్రం తన జాగీరైనట్టుగా కనీసం మంత్రివర్గ సమావేశం లేకుండా ఆన్‌లైన్‌లో ఆమోదం తీసుకొని ఏకపక్ష ధోరణితో పోవడమే గొడవలకు కారణమని విమర్శించారు. కడప జిల్లా ప్రజలు జగన్‌కు ఓట్లు వేసినందుకు వైఎస్సార్ కడప జిల్లా పేరులో నుంచి కడపను తీసివేశారని అసహనం వ్యక్తం చేశారు. కడప పేరును ఎవరినడిగి తీశారో చెప్పాలన్నారు. కోనసీమ జిల్లా విషయంలో అంబేద్కర్ పేరును ముందే పెట్టకుండా, అందరితో చర్చించకుండా ఆ మహనీయుని పేరును కూడా సీఎం జగన్ వివాదాస్పదం చేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుకు కళంకం తెచ్చిన ఘన చరిత్ర సీఎం జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ తన డ్రైవర్‌గా ఉన్న దళిత యువకుడిని అతిదారుణంగా కొట్టి హత్య చేసి మృతదేహాన్ని కారులో నేరుగా వారి తల్లిదండ్రుల వద్దకే తీసుకెళ్లగలిగారంటే రాష్ట్రంలో చట్టమనేది ఉందా లేదా అని విచారం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలే చట్టాన్ని గౌరవించకపోతే ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ చేతిలో చనిపోయిన డ్రైవర్ భార్య మూడు నెలల గర్భవతి అని, ఇప్పటి వరకు కనీసం ఒక్క మంత్రి కూడా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ మద్యం తాగి డ్రైవర్‌ని కిరాతకంగా చంపితే, చనిపోయిన డ్రైవర్ మద్యం తాగాడని ఎస్పీ చెప్పడం శోచనీయమన్నారు.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని తూర్పారబట్టారు. పోలీసులు అధికార పార్టీ నేతల చెప్పుచేతల్లో ఉన్నందునే ఇష్టానుసారంగా చంపి మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో దళితులు, బలహీన వర్గాలు, పేద ప్రజలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అధికార పార్టీకి బలైన విశాఖపట్నం డాక్టర్ సుధాకర్ నుంచి ప్రారంభమైన దుర్మార్గపు చర్యలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు మంత్రి పదవులతోపాటు ఇతర పదవులు ఇచ్చినప్పటికీ రూపాయి ఖర్చుపెట్టే అధికారం సీఎం జగన్ ఎవరికీ ఇవ్వలేదన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అప్పులు తీసుకునివస్తే సీఎం జగన్ కంప్యూటర్ బటన్ నొక్కి పంచడం తప్ప ఎవరికీ ఎలాంటి అధికారం లేదని ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర మంత్రులందరూ ఆత్మాభిమానం కోల్పోయిన డమ్మీలుగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి మాత్రమే అధికారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగలేదని, మంత్రులెవరో ప్రజలకు తెలియనందునే సామాజిక న్యాయభేరీ బస్సు యాత్ర చేస్తున్నారని అన్నారు. మంత్రుల బస్సు యాత్ర నేరుగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి సామాజిక న్యాయం గురించి దళితుడిని చంపిన వ్యక్తిని అడగాలన్నారు. దేశంలో సామాజిక న్యాయానికి ఆద్యులు మహాత్మా జ్యోతి బాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, అలాంటిది ఓ జిల్లాకు అంబేద్కర్ పేరుపెట్టడంపై ఇంత రాద్ధాంతం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం లేదని, రేపల్లె రైల్వే స్టేషన్‌లో పేద గర్భిణిపై అత్యాచారం జరిగితే హోం మంత్రి స్పందించిన తీరు బాధాకరమన్నారు. దావోస్‌లో సీఎం జగన్ వద్దకు అందరూ వస్తున్నారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పడం హాస్యాస్పదమని, తెలంగాణ మంత్రి కేటీఆర్ వద్దకు చేరుకొని హైదరాబాద్‌లో పరిశ్రమలు పెట్టడానికి మొగ్గు చూపుతున్నారని తెలిపారు. యూనిట్ 1 రూపాయి 99 పైసల విద్యుత్‌ను 2 రూపాయల 49 పైసలకు కమీషన్ల కోసం సీఎం జగన్ కొంటున్నారని మండిపడ్డారు. ఏపీలో ఎండ లేనట్లు రాజస్థాన్ నుంచి సోలార్ విద్యుత్ కొనుగోలు చేసి అదానీ కమీషన్లకు లాలూచీ పడ్డారని విమర్శించారు. జగన్ సీఎం అయిన తర్వాత విశాఖపట్నం కబ్జాలకు గురై బ్రాండ్ ఇమేజ్ పోగొట్టుకుందని అన్నారు. అప్పట్లో అమరావతిలో 40 వేల మంది పని చేసేవారని, ప్రస్తుతం వాచ్‌మెన్ తప్ప ఎవరూ లేరని ఎద్దేవా చేశారు. అమరావతి ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధి చెందకూడదని జగన్ కంకణం కట్టుకున్నారని అన్నారు. కడపలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపనలు చేశారని, అయితే సీఎం జగన్ ఏకంగా శిలా ఫలకం వేసి ఇంతవరకు స్టీల్ ఫ్యాక్టరీని స్థాపించలేకపోయారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చాలా బాధాకరమైన పరిస్థితులున్నాయని, జగన్‌ను చూసి పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రావడం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో నెలకొన్న దుర్భర పరిస్థితులకు కారణమైన వైసీపీ పాలనకు వ్యతిరేకంగా జూన్ 2న చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించి గవర్నర్‌కి అన్ని విషయాలు వివరిస్తామని రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో దళితులు, బడుగు వర్గాలు, పేద ప్రజలందరికీ సీపీఐ అండగా ఉంటుందని అన్నారు.

పోలీస్ గుప్పిట కోనసీమ

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షించేందుకు ఎస్పీ కారులో వెళ్తుండగా రావులపాలెం రింగ్ సెంటర్ వద్ద కొంత మంది యువకులు ఎస్పీ వాహనంపై రాళ్లు విసిరారు. వెంటనే అప్రమత్తమైప పోలీసులు యువకులను వెంబడించడంతో వారు పారిపోయారు. ఈ ఘటనతో పోలీసులు మరింతగా అప్రమత్తం అయ్యారు. కొన్ని చోట్ల యువకులు దాగి ఉండొచ్చని, ఆందోళనకు దిగొచ్చని భావించి పకడ్బందీగా భద్రతా చర్యల చేపట్టారు. రావులపాలెంలో పరిస్థితి అదుపులోనే ఉందని పోలీసులు తెలిపారు. గోపాలపురంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బలగాలను మోహరించారు. బందోబస్తు నిమిత్తం ఇక్కడకు వచ్చిన కాకినాడ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి మాట్లాడుతూ రావులపాలెంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. ఐదుగురు మించి గుమిగూడవద్దని స్పష్టం చేశారు. ర్యాలీలు చేసే ఆలోచనలు మానుకోవాలని కోరారు. ప్రయాణీకుల అవస్థలు... ఆర్టీసీ బస్సులను చాలా వరకు తగ్గించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో స్థానిక అమలాపురం రోడ్డు, జాతీయ రహదారిపై ప్రైవేటు వాహనాల కోసం మండుటెండలో అల్లాడుతూ ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే కళా వెంకట్రావు సెంటర్, అమలాపురం రోడ్డు, మార్కెట్ రోడ్లలో కొన్ని దుకాణాలను, కొన్ని పెట్రోల్ బంకులను కూడా మూయించి వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వివిధ పనుల నిమిత్తం రావులపాలెం వచ్చిన వారిని సైతం పోలీసులు అడ్డుకోవడంతో పాటు, కొంతమంది నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అమలాపురంలో అడుగడుగునా నిఘా

హింసాత్మక ఘటన నేపథ్యంలో అమలాపురం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. మళ్లీ ఆందోళనకారులు వచ్చే అవకాశం ఉండొచ్చనే అనుమానంతో.. ఏయే మార్గాల నుంచి నిరసనకారులు వచ్చే అవకాశం ఉందో.. ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు. అంతేకాకుండా.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా.. అమలాపురంలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. అమలాపురంలో కర్ఫ్యూ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కాగా.. ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోనసీమలో సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉంటాయని, ర్యాలీలు.. నిరసనలు.. బహిరంగ సభలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. కాగా మంగళవారం చెలరేగిన అల్లర్లకు కీలక సూత్రదారిగా భావిస్తోన్న అన్యం సాయి అనే వ్యక్తిని అమలాపురం పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. అన్యం సాయి, ఈనెల 20న కోనసీమ సాధన సమితి ఆందోళనలో పాల్గొన్నారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద ఒంటిపై సాయి పెట్రోల్ పోసుకుని నిరసన తెలిపాడు. అతనిపై గతంలోనే పోలీసులు రౌడీషీట్ తెరిచారు. తాజాగా అమలాపురంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. అల్లర్లలో అన్యం సాయి పాత్రపై విచారిస్తున్నారు.

దాడులు ఆపడంలో పోలీసులు విఫలం

అమలాపురంలో మంత్రి, ఎమ్మెల్యే ఇళ్లపై దాడులను నిలువరించడంలో పోలీసులు విఫలం అయ్యారని అంబేద్కతర్ జిల్లా సాధన సమితి నాయకులు విమర్శించారు. మంటల్లో కాలిన ఇంటిని మంత్రి విశ్వరూప్ పరిశీలించే సమయంలో అక్కడికు వచ్చిన అంబేద్కర్ జిల్లా సాధన సమితి నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంగళవారం నాటి ఘటనలో దహనమైన తన ఇంటిని మంత్రి విశ్వరూప్ పరిశీలించారు. ర్యాలీకి పిలుపునిచ్చిన కోనసీమ సాధన సమితి ఇందుకు బాధ్యత తీసుకోవాలని విశ్వరూప్ అన్నారు. కొంతమంది సంఘ విద్రోహశక్తులు ర్యాలీలోకి చొరబడ్డారని, అమలాపురం ప్రజలకు ఎలాంటి తప్పుడు ఆలోచనలు లేవన్నారు. ఉద్యమం ముసుగులో కొంతమంది రౌడీషీటర్లు చొరబడ్డారని ఆరోపించారు. ముందుగా అనుకున్న ప్రకారమే తన ఇంటిపై దాడి చేశారని తెలిపారు. ఈ ఘటనలో తెదేపా, జనసేన ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారన్నారు. అయితే ఈ ఘటనలో వైసీపీతో పాటు ఎవరున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబసభ్యులంతా క్షేమంగా ఉన్నామని తెలిపారు. అమలాపురం ప్రజలంతా సంయమనం పాటించాలని కోరారు. అంబేద్కర్ పేరు పెట్టాలని అన్ని పార్టీలు కోరాయని మంత్రి విశ్వరూప్ అన్నారు.

యూనికాన్ స్టార్టప్ హబ్‌గా విశాఖ

(మొదటిపేజీ తరువాయి)

రికార్డులు భద్రపరచడం.. ఈ అంశాలతో ముడిపడిన సాంకేతిక పరిజ్ఞానం తదితర విషయాలపై కాయిన్‌స్విచ్ క్యూబర్ కంపెనీ వ్యవస్థాపకుడు, గ్రూపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్ సింఘాల్‌తో సీఎం జగన్ చర్చించారు. అనంతరం సింఘాల్ మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే రికార్డులు నిక్షిప్తం చేయడంతో ఏపీ సర్కారుకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈజ్ మై ట్రిప్ సహ వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టితో సీఎం సమావేశమయ్యారు. ఇందులో ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై వారి మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రశాంత్ పిట్టి మట్లాడుతూ ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి తమవంతు చేయూత అందిస్తామన్నారు. అలాగే ఏపీలోని పర్యాటక స్థలాలకు మరింత గుర్తింపు తీసుకువస్తామని వెల్లడించారు.

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో మీషో వ్యవస్థాపకుడు, సీఈఓ విదిత్ ఆత్రేయ, వీహెచ్.ఏఐ వ్యవస్థాపకుడు సతీష్ జయకుమార్, కొర్‌సెరా వైస్ ప్రెసిడెంట్ కెవిన్ మిల్స్ ఉన్నారు.

హిందూస్థాన్ జింక్ ప్రైవేటీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న 29.5 శాతం వాటాలను విక్రయించేందుకు సిద్ధమవుతోంది. దీనికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం కూడా లభించింది. ఈ మొత్తం వాటాను ప్రభుత్వం రూ.38,560 కోట్లకు విక్రయించాలని భావిస్తోంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 'పెట్టుబడుల ఉపసంహరణ, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం ' ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈ కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యానికి మరో అడుగు దగ్గరైంది. పీఎస్‌యూ పెట్టుబడుల ఉపసంహరణ, వ్యూహాత్మక విక్రయాల ద్వారా రూ.65వేల కోట్లను ప్రభుత్వం ఆర్జించింది. హెచ్‌జెడ్ఎల్‌లో 29.5శాతం వాటా అంటే 124.96 కోట్లకుపైగా షేర్లు, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం వీటిని విక్రయిస్తే రూ.38,000 కోట్లు వస్తాయి. హిందుస్థాన్ జింక్ 2002 వరకు ప్రభుత్వ కంపెనీగా ఉంది. 2002, ఏప్రిల్‌లో 25శాతం వాటాను స్టెరలైట్ ఆపర్చునిటీస్ అండ్ వెంచర్స్ లిమిటెడ్ (ఎస్ఓవీఎల్)కు రూ.445 కోట్లకు ప్రభుత్వం విక్రయించింది. దాంతో హెచ్‌జెడ్ఎల్ వేదాంత గ్రూపు నియంత్రణలోకి వెళ్లింది. ఆ తర్వాత మార్కెట్ నుంచి 20శాతం షేర్లను వేదాంత గ్రూపు కొనుగోలు చేసింది. 2003 నవంబరులో ప్రభుత్వం నుంచి మరో 18.92శాతం వాటాను కొన్నది. దీంతో హిందుస్థాన్ జింక్‌లో ఆ సంస్థ మొత్తం వాటా 64.92శాతానికి పెరిగింది. కాగా, హెచ్‌జెడ్ఎల్ ప్రస్తుత షేర్ల విలువ ప్రకారం మరో ఐదు శాతాన్ని కంపెనీ కొనుగోలు చేయగలదని వేదాంతకు సారథ్యం వహించే మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్ ఇటీవలి అన్నారు.

అమ్మకానికి 186 గనులు

దేశంలో 186 గనులను అమ్మకానికి పెట్టిన క్రమంలో ఖనిజ బ్లాకుల వేలాన్ని నిలువరించినట్లు కేంద్రప్రభుత్వం బుధవారం తెలిపింది. అమ్మకానికి పెట్టిన 186 గనుల్లో 28 గతనెలలో వేలం ద్వారా కేటాయించగా 46ను గతేడాది వేలం వేసి ఈ ఏడాదిలో విక్రయించినట్లు 'భారత్-స్వీడెన్ గనుల దినోత్సవం' సందర్భంగా గనుల శాఖ సంయుక్త కార్యదర్శి వీణా కుమారి ధర్మల్ తెలిపారు. వేలం ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి వాటా లభిస్తోందని, రేసులో ముందు నుంచి ఉన్న రాష్ట్రాలు సంతోషంగా ఉన్నాయని చెప్పారు. భారతీయ మైనింగ్ పరిశ్రమకు సాంకేతికపరమైన మద్దతుతో పాటు ఆలోమేషన్ సహకారాన్ని స్వీడెన్ కంపెనీలు అందిస్తున్నట్లు తెలిపారు. తాజా భేటీతో రెండు దేశాల మధ్య సహకారం పెరుగుతుందని ఆకాంక్షించారు. భారత్‌కు స్వీడెన్ రాయబారి క్లాస్ మోలిన్ మాట్లాడుతూ, సహకారంతో పాటు అవకాశాలను పెంచుకునే రోజు భారత్-స్వీడెన్ మైనింగ్ దినోత్సవం అని అన్నారు.

జూన్ 23న ఆత్మకూరు ఉపఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

నెల 6 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. జూన్ 9 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తర్వాత జూన్ 23న పోలింగ్ నిర్వహించనుండగా... జూన్ 26న ఓట్ల లెక్కింపు నిర్వహించి అదే రోజు ఫలితాన్ని వెల్లడించనున్నారు. ఆత్మకూరుతో పాటు దేశంలోని 6 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు, మూడు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూలును కూడా ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్, రాంపూర్, పంజాబ్‌లోని సంగ్రూర్ లోక్‌సభ స్థానాలకు, ఢిల్లీ రాష్ట్రంలోని రాజేందర్ నగర్, మందార్ (జార్ఖండ్), త్రిపురలోని అగర్తల, బోర్దోవాలి, సుర్మా, జుబారాజ్‌నగర్ అసెంబ్లీ స్థానాలకు జూన్ 23నే పోలింగ్ జరగనుంది. 26న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

కార్చిచ్చుకు కారణమెవరు?

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదు. అదే రోజు అమలాపురం కేంద్రంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా కూడా ప్రకటించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదు. ఒకవేళ అక్కడ సమస్య తీవ్రంగా ఉందని భావిస్తే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలతో చర్చలు జరిపి అందర్నీ ఒప్పించే ప్రయత్నం చేసి ఉండాల్సింది. అలాగాకుండా స్థానిక ప్రజలతో గాని, ఇతర రాజకీయపక్ష నేతలతో గాని కనీస సంప్రదింపులు జరపకుండా కొత్త జిల్లాలు ఏర్పాటైన నెలన్నర తర్వాత అకస్మాత్తుగా ఈనెల 18వ తేదీ కోనసీమ జిల్లా పేరు మారుస్తున్నట్లు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అంతటితో వదిలేయకుండా నెలరోజుల పాటు దానిపై ప్రజాభిప్రాయాన్ని కోరింది. దీనిలోనే రాజకీయ కుట్ర దాగి ఉందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. జిల్లా పేరు మార్చిన తర్వాత అభిప్రాయాల స్వీకరణ కోరడమంటేనే ఆ అంశాన్ని వివాదం చేయాలని ప్రోత్సహించేందుకేనని వారు ఆరోపిస్తున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ వివాదానికి అధికారపార్టీ ఆజ్యం పోసిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈనెల 20వ తేదీ ముఖ్యమంత్రి దావోస్ పర్యటనకు బయలుదేరడం, దానికి ముందుగా జిల్లా పేరు మార్పు చేయడం, ఆయన విదేశాల్లో ఉండగానే అల్లర్లు జరగడం, అదే సమయంలో మంత్రి కుటుంబ సభ్యులను అక్కడనుంచి ముందే తరలించడం, చలో కలెక్టరేట్‌కు పిలుపు ఇచ్చినా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం వంటి పరిణామాలే నిదర్శనంగా పేర్కొంటున్నాయి. అల్లర్లలో పాల్గొన్న కీలక వ్యక్తులు అధికారపార్టీకి చెందిన వ్యక్తులున్నట్లు ప్రతిపక్షపార్టీయైన టీడీపీ సోషల్ మీడియా వేదికగా దౌర్జన్యకారుల విధ్వంసానికి ఫొటో ఆధారాలను విడుదల చేసింది. మరోపక్క అధికారపార్టీ నేతలు, మంత్రులు కూడా అమలాపురం అల్లర్లకు జనసేన, టీడీపీయే కారణమంటూ విమర్శలు గుప్పించారు. మా మంత్రి, ఎమ్మెల్యేల ఇంటిపై మేమే దాడి చేయించుకుంటామా ? అర్థంలేని ఆరోపణలతో ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని,దానిని బట్టే ఇది రాజకీయ కుట్ర అని అర్థమవుతోందని మంత్రులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై బురద చల్లే యత్నాలు మాని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రగతి పనులు వేగవంతం చేయాలి

సీఎస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రగతి పనులను వేగవంతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. బుధవారం దిల్లీ నుంచి ప్రధాని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో వీడియో సమావేశం ద్వారా ఆయా రాష్ట్రాల్లో చేపట్టిన ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించారు. ప్రగతి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రాయపూర్-విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్, కాకినాడ-శ్రీకాకుళం సహజ వాయువు పైపులైను ప్రాజెక్టుల ప్రగతిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీఎస్ డా.సమీర్ శర్మతో సమీక్షించారు. అలాగే నేషనల్ బ్రాడ్ బ్యాండ్ మిషన్ గురించి సీఎస్‌లతో ప్రధాని సమీక్షించారు. రాయపూర్-విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్‌కు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీఎస్ సమీర్ శర్మను ప్రధాని ఆదేశించారు. ఈ ఎకనమిక్ కారిడార్ ఏర్పాటుతో చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా అల్యూమినియం, బొగ్గు, బాక్సైట్ వంటి విలువైన ఖనిజాలు విశాఖపట్నం ఓడరేవు ద్వారా ఎగుమతి, దిగుమతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా కాకినాడ-శ్రీకాకుళం సహజ వాయువు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం నేషనల్ బ్రాడ్ బ్యాండ్ మిషన్ గురించి మోదీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 5జీ సేవలకు ఇది ఎంతగానో ప్రోత్సాహకరంగా ఉంటుందని తెలిపారు. ఫైబర్, టవర్ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు వేగవంతం చేయడంతోపాటు ఆ సేవలను కేంద్రీకరిస్తుందని అన్నారు. అంతేగాక గతిశక్తి సంచార్ పోర్టల్ కేంద్రీకృత రైట్ ఆఫ్ వే(ఆర్‌ఓడబ్ల్యు) అనుమతులను సులభతరం చేస్తుందని ప్రధాని చెప్పారు. టెలికాం పరిశ్రమ మౌలిక వసతుల కల్పన కోసం, ఆర్‌ఓడబ్ల్యు అనుమతులు పొందేందుకు, 5జీ సేవల కోసం ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పోర్టల్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలను అనుసంధానించేలా ఏకీకృత, సమీకృత, కేంద్రీకృత విధానాన్ని అందిస్తుందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రాయపూర్-విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్‌కు సంబంధించి 798 హెక్టార్ల భూసేకరణకుగాను 561 హెక్టార్ల భూమిని ఇప్పటికే అప్పగించామని, కాకినాడ-శ్రీకాకుళం సహజవాయువు పైపు లైను ప్రాజెక్టుకు సంబంధించి శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకూ గల మొదటి దశ పూర్తయిందని సీఎస్ ప్రధానికి వివరించారు. ఈ వీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ముఖ్య కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, జయలక్ష్మి, అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శి డా.చలపతిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమలాపురం అల్లర్లు వైసీపీ కుట్రే !

- ఎస్సీల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారిపట్టించేందుకే
- కడప జిల్లాకు కూడా అంబేద్కర్ పేరు పెట్టే ఆలోచన చేయవచ్చు
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కొత్తగా జిల్లాలు ఏర్పాటు గెజిట్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టకుండా, ఇప్పుడు హడావుడిగా కోనసీమ జిల్లాకు ఆ పేరు పెట్టడం వైసీపీ రాజకీయ కుట్రలో భాగమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ఖచ్చితంగా వైసీపీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలో భాగంగానే అమలాపురంలో అల్లర్లు చెలరేగాయని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ఎస్సీల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతోనే కోనసీమలో గొడవలు రేపారని, కులాల కుంపటి రాజేసి చలి కాచుకునే సంస్కృతి వైసీపీదని అన్నారు. కుల ఘర్షణలు రావణకాష్టం లాంటివని, ఒక్కసారి అంటుకుంటే దేశమంతా కాలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. వైసీపీ మంత్రివర్గం నోటికి వచ్చినట్లు మాట్లాడి గొడవలు పెంచే ప్రయత్నం చేయడం తప్ప, తగ్గించే ప్రయత్నాలు చేయడం లేదన్నారు. 'పాలనా సౌలభ్యం కోసమని వైసీపీ ప్రభుత్వం ఏప్రిల్ 4న కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. కొత్త జిల్లాల్లో కొన్నింటికి శ్రీ సత్యసాయి, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు వంటి వారి పేర్లతో నామకరణం చేసింది. అదే రోజు అన్ని జిల్లాలతో పాటు కోనసీమ జిల్లాకు కూడా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టేస్తే ఈ రోజు ఇలాంటి పరిస్థితి వచ్చేదే కాదన్నారు. కావాలని జాప్యం చేయడంలో వైసీపీ ఉద్దేశం ఏంటి? నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోగా వినతులు ఇవ్వాలని కోరడం వెనక ఆంతర్యం ఏమిటి? గొడవలుపడాలనే వీళ్లు కోరుకుంటున్నారు. పేరు మార్పులపై కొన్ని జిల్లాల్లో ఇలానే అభ్యంతరాలు వస్తే వాళ్లకు సమయం ఇవ్వకుండా ఇక్కడ మాత్రమే 30 రోజులుపాటు సమయం ఇచ్చారంటే దీని వెనకనున్న దురుద్దేశం ఏమిటో స్పష్టంగా తెలుస్తోందన్నారు. 30 రోజులు గడువు ఇస్తే ఇక్కడ గొడవలు జరుగుతాయని ముందే తెలుసు. అల్లర్లు జరగాలని కోరుకుంటోంది కాబట్టే.. ఘర్షణ వాతావరణం కల్పించి భావోద్వేగాలను రెచ్చగొట్టింది. అందుకే మంత్రి కుటుంబీకులను పోలీసులు ముందే అక్కడ నుంచి తరలించారు. ఇవన్నీ చూస్తుంటే ముందస్తు ప్రణాళికలో భాగంగానే దాడులు జరిగాయని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరికీ అంబేద్కర్‌పై గౌరవభావం ఉంటుంది. ఆయన పేరును వివాదాలకు కేంద్ర బిందువుగా మార్చడం దురదృష్టకరం. అంబేద్కర్ పేరును రాజకీయ ప్రయోజనాలకు వాడుకొని వదిలేస్తున్నారు తప్ప ఆయన అందించిన స్ఫూర్తిని కొనసాగించడం లేదు. వైసీపీ ప్రభుత్వానికి నిజంగా ఆయన మీద ప్రేమ ఉంటే రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా ఒక్క కోనసీమకే ఆయన పేరు ఎందుకు పెట్టాలని అనుకుంటోంది? కడప జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టొచ్చు కదా? కనీసం కడప జిల్లాలో ఒక ప్రాంతానికైనా ఆ మహనీయుడి పేరు పెట్టారా? అని ప్రశ్నించారు. ఎస్సీలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్న వైసీపీ ప్రభుత్వం గత మూడేళ్లుగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.10 వేల కోట్లను వివిధ సంక్షేమ పథకాలకు దారి మళ్లించింది. ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం దళితుల భూములు 11 వేల ఎకరాల మేర లాక్కున్నారు. సివిల్స్, గ్రూప్-1 పరీక్షలకు తయారయ్యే ఎస్సీ యువతకు ఫీజులు ఆపేశారు. హైదరాబాద్, ఢిల్లీ లాంటి చోట్ల మెరుగైన శిక్షణ పొందే అవకాశం లేకుండా చేశారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేశారు. అమరావతికి చెందిన ఎస్సీ రైతుల మీదే ఈ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర పని చేసిన డ్రైవర్ హత్య కేసును పక్కదారి పట్టించాలనే దురుద్దేశంతోనే కోనసీమ చిచ్చుకు అధికార పక్షం తెరలేపింది. ఇటువంటి వైసీపీ కుత్సితపు రాజకీయ పోకడలు, విభజన రాజకీయాలు చేసే నాయకుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతగా వ్యవహరించాలని, సున్నిత విషయాల్లో ఎవరూ భావోద్వేగాలకులోను కావద్దని కోరారు.

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-సింగరాయకొండ: పెట్రోలు, డీజిలు, గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శింగరాయకొండ పట్టణంలో బుధవారం సీపీఐ,సీపీఎం అధ్వర్యంలో పెట్రోలు, డీజిలు, గ్యాస్, కరెంటు చార్జీలు, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ప్రజాచైతన్య కార్యక్రమంలో ముప్పాళ్ల పాల్గొని ప్రసంగించారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోకపోగా పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంటనూనె, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు లీటర్ పెట్రోలు రూ.68, లీటర్ డీజిల్ రూ.57, గ్యాస్ సిలిండర్ రూ.460గా ఉంటే... ఇప్పుడు పెట్రోలు రూ.120, డీజిల్ రూ.105, గ్యాస్ సిలిండర్ రూ.1050గా ఉన్నాయని, ఈ మూడింటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం ద్వారా ధరలు బాగా తగ్గుతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలను మన రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అమలు చేయటం ద్వారా కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఇనుము, సిమెంటు, ఇసుక మొదలైన వాటి రేట్లు పెరగడంతో సామాన్యులు ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కేవీవీ ప్రసాద్, పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి, జి.బాలకోటయ్య, బలరాం, సీపీఎం నాయకులు కొండారెడ్డి, రాము, మోజస్, అగ్రిగోల్డు యూనియన్ నాయకులు గిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి సామాజిక న్యాయ భేరి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. వైసీపీ శాసనసభా పక్షం కార్యాలయంలో సామాజిక న్యాయ భేరి-జయహో జగనన్న పేరుతో రూపొందించిన ఆడియో, వీడియోలను మంత్రి బొత్స బుధవారం విడుదల చేశారు. సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు జరిగిన సామాజిక న్యాయాన్ని వివరిస్తూ, సామాజిక న్యాయభేరి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టామని వివరించారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు అటు ప్రభుత్వంలోనూ, ఇటు స్థానిక సంస్థల నుంచి రాజ్యసభ వరకు రాజకీయ పదవులు, వివిధ కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వడం, తమ ప్రభుత్వంలో ఆ వర్గాలకు ఏ విధంగా న్యాయం కల్పించామనే అంశాన్ని ప్రజలకు చెప్పాలనే ఉద్దేశంతో ఈ యాత్ర చేపట్టామని చెప్పారు. జగన్ నాయకత్వంలో కేబినెట్‌లో 25మంది మంత్రులు ఉంటే, అందులో 17మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి స్థానం కల్పించారని తెలిపారు. ఎన్నికల ముందు బలహీన వర్గాలకు ఇచ్చిన హామీ ప్రకారం 50శాతం కంటే ఎక్కువగా నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాల వారికి సామాజిక న్యాయం ద్వారా సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమని గర్వంగా చెప్పుకుంటామన్నారు. సామాజిక న్యాయం అనేది గత ప్రభుత్వాల హయాంలో మాటలకే పరిమితమవ్వగా, సీఎం జగన్ చేతల్లో చూపించారన్నారు. సామాజిక న్యాయభేరి యాత్ర గురువారం శ్రీకాకుళంలో మొదలై అనంతపురంలో ముగుస్తుందన్నారు.

26న విజయనగరం, 27న రాజమండ్రి, 28న నరసరావుపేట, 29న అనంతపురంలో బహిరంగ సభలు నిర్వహిస్తామని వివరించారు. ఈ బస్సు యాత్రలో క్యాబినెట్‌లో ఉన్న 17 మంది మంత్రులతోపాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఆయా ప్రాంతాల చైర్మన్లు, వివిధ హోదాల్లో ఉన్నవారంతా పాల్గొంటారన్నారు. బడుగు, బలహీనవర్గాల వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు నారాయణ స్వామి, అంజాద్ బాషా, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేశ్, కారుమూరి వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళల ద్వారా ప్రజాచైతన్యం

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గని, చంద్రా నాయక్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్/కల్చరల్: ప్రజానాట్య మండలి ఉన్నత ఆశయాలు కోసం కళాకారులు పునరంకితం కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గని, చంద్రనాయక్ పేర్కొన్నారు. కడప కళాక్షేత్రంలో ప్రజానాట్యమండలి వ్యవస్థాపక వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం, చైతన్యం కోసం ప్రజా నాట్యమండలి 79 సంవత్సరాలుగా అవిశ్రాంత సాంస్కృతిక ఉద్యమాన్ని ప్రజల కోసం కొనసాగిస్తున్నారు. కళల ద్వారా ప్రజలను జాగృతం చేసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. దేశంలో పాలకులు ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రజల మధ్య విభేదాన్ని సృష్టిస్తున్నారన్నారు. అనంతరం కడప జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కోలాటం చెక్కభజన తదితర కళారూపాలను ప్రదర్శించారు. అభ్యుదయ జానపద భరతనాట్యం కూచిపూడి కర్ర విన్యాసాలు కత్తి విన్యాసాలు చేపట్టారు. బద్వేల్ కోలాట బృందం బాలకృష్ణ కడప మాసాపేటకు చెందిన కర్రసాము, కత్తి సాము విన్యాసములు కిషోర్ బృందం, మైదుకూరు సుదీర్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాన్స్ క్లాసికల్ వెర్షన్ వరలక్ష్మి డాన్స్ అకాడమీ కడప తదితరులు ఈ సాంస్కృతిక కార్యక్రమాల లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు ఆర్. పిచ్చయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, లక్ష్మి నారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి టౌన్‌షిప్ ప్లాట్లకు ఈ-వేలం

ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) పరిధిలోని గుంటూరు జిల్లా నవులూరులో 16వ నంబరు జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న అమరావతి టౌన్ షిప్‌లో 331 ప్లాట్లను ఈ-వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించినట్లు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. నగరంలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమరావతి టౌన్‌షిప్‌లోని లాట్-1లో ఉన్న 29 ప్లాట్లకు ఈ-వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటిలో 200 గజాలు ప్లాట్లు 23, 1,000 గజాల ప్లాట్లు ఆరు ఉన్నాయని వివరించారు. గజం విలువ రూ.17,800లుగా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఆసక్తిగలవారు ఈ నెల 27వ తేదీ వరకు konugolu.ap.gov.in లేదా https://crda.ap.gov.in. వెబ్‌సైట్లలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీన దరఖాస్తుదారులకు ఈ-వేలం ద్వారా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు. ఈ ప్లాట్లు కొనుగోలు చేసేవారికి యూనియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల నుంచి రుణం కూడా తీసుకునే సదుపాయం ఉందని చెప్పారు. మరిన్ని వివరాలకు 0866-2527124 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జల సిరులు కురిపించేలా

జగన్ ప్రభుత్వం అడుగులు

- మద్దువలస రెండవ దశ పనులకు అనుమతులు
- అదనంగా 12,500 ఎకరాలకు సాగు నీరు
- నదుల అనుసంధానం ద్వారా శ్రీకాకుళం జిల్లా సస్యశ్యామలం
- శాసనసభ సభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: శ్రీకాకుళం జిల్లాలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం తెలిపారు. ఈ దిశగా చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు జల సిరుల కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని ఆయన కోరారు. శ్రీకాకుళం అర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బుధవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక అంశాలను స్పీకర్ వెల్లడించారు. మద్దువలస ఫేజ్-2 గొర్లె శ్రీరాములు నాయుడు జలాశయం ద్వారా మొదటి దశ విస్తరణలో 27,500 ఎకరాలకు సాగు నీరు లభిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రెండవ దశ విస్తరణ ద్వారా అదనంగా 12,500 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం రూ.26.65 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ పరిపాలనా పరమైన ఆమోదం తెలిపిందన్నారు. కుడి ప్రధాన కాలువను మరో ఐదు కిలోమీటర్ల మేర విస్తరించడం ద్వారా దీని పరిధి 55.700 కి.మీ పెరగనుందని తెలిపారు. వర్షాధారిత భూములకు అదనపు సాగుకు దీని నిర్మాణం వీలు పడే అవకాశం ఉందన్నారు. రెండవ దశ విస్తరణ పనుల ద్వారా పొందూరు మండలంలో తండ్యం, లక్ష్మీపురం, పొందూరు, రాపాక, వావిళ్లపల్లి పేట, వీఆర్ గూడెం, బుడ్డి కంచరాం, ధర్మపురం, కొంచాడ, తొలాపి, పిల్లల వలస, దళ్ల వలస కోటిపల్లి గ్రామాలకు ప్రయోజనం కలగనుందని అన్నారు. లావేరు మండలంలో పైడయ్యవలస కొత్త కుంకామ్, పాత కుంకుమ్, అదపాక, పెద్దకొత్తపల్లి, బుడుమూరు, పెద్ద రావు పల్లి, విజయరాంపురం గ్రామాల భూములు సస్యశ్యామలం కానున్నాయని ఆయన వివరించారు. జి.సిగడాం మండలంలో కప్పరం, మధుపం, వాండ్రంగి, ఎచ్చెర్ల మండలంలో అరిణాం అక్కివలస గ్రామాల భూములు పూర్తిస్థాయి సాగులోకి రానున్నాయని అన్నారు. ధర్మపురం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 12.25 కి.మీ మేర 6,400 ఎకరాలు, అరిణాం అక్కివలస డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 10.70 కి.మీ మేర 6,100 ఎకరాలు పూర్తిస్థాయిలో సాగులోకి రానున్నట్లు తెలిపారు. రెండవ దశ విస్తరణ పనులకు సాంకేతికపరమైన అనుమతులు మంజూరుకు చర్యలు చేపట్టాల్సిందిగా ఉత్తరాంధ్ర జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్‌కి అధికారిక ఆదేశాలు ఇచ్చినట్లు అయిందన్నారు. ఇవి పూర్తయితే పనులు ప్రారంభంకానున్నాయన్నారు. సీఎం జగన్‌కి శ్రీకాకుళం జిల్లా రైతుల పట్ల ఉన్న ప్రేమాభిమానాలు తేటతెల్లం అయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, జడ్పీటీసీ లోలుగు కాంతారావు, పొందూరు మండలం, టౌన్ పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, గాడు నాగరాజు, సర్పంచులు మొదలవలస పాపారావు, కిల్లాడ సూర్యారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, నాయకులు గుడ్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరివల్లే కోనసీమలో అశాంతి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోనసీమ జిల్లాకు ముందే అంబేద్కర్ పేరు పెట్టి ఉంటే ఏ సమస్యలు ఉండేవి కావని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కారణంగానే కోనసీమ భగ్గుమందని బుధవారం నారాయణ మీడియాకి విడుదల చేసిన వీడియో సందేశంలో అభిప్రాయపడ్డారు. జిల్లాల విభజన తరుణంలోనే అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్లు వచ్చినా పట్టించుకోకుండా సీఎం జగన్ ఊగిసలాట ధోరణిలో వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కోనసీమకు అంబేద్కర్ పేరు విషయంలో ప్రారంభమైన ఘర్షణలు చిలికి చిలికి గాలివానలా మారాయని, చివరకు మంత్రి విశ్వరూప్ గృహ దహనం వరకు వెళ్లిందని పేర్కొన్నారు.ఈ ఘటనను కులపరమైన ఘర్షణగా చూడలేమని, ప్రభుత్వంపై వ్యతిరేకతకు ప్రతిబింబంగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను లేకుండా చేయాలని చూస్తున్న ప్రభుత్వ విధానాలపై వ్యతిరేక ఉద్యమాలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని గుర్తు చేశారు. జిల్లాల ఏర్పాటు తరుణంలోనే అంబేద్కర్ పేరు పెట్టి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఆ సమయంలో మొండిగా వ్యవహరించి అనంతర కాలంలో ఓట్లు, రాజకీయ ఎత్తుగడలతో సీఎం జగన్ సంకుచిత వైఖరిని ప్రదర్శించారని ఆరోపించారు. ఏ విషయంలో అయినా స్పష్టత ప్రదర్శించే సీఎం ఇలా ఎందుకు చేశారో చెప్పాలని నారాయణ ప్రశ్నించారు. ఈ విషయంలో ఆత్మస్తుతి పరనింద పనికి రాదని ప్రభుత్వానికి సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తే ఇటువంటి పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు?: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించలేని సమావేశాలతో ఉపయోగమే మిటని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ-ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్. తిమ్మన్న ప్రశ్నించారు. ఏపీ సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశానికి ఎస్టీయూ నేతలు హాజర య్యారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి అరుణ్ కుమార్‌కు ఉపాధ్యా యులకు చెందిన 28 డిమాండ్లపై వినతిపత్రాన్ని అందజేశారు. జీఏడీ అధ్వర్యంలోని 71 పెండింగ్ సమస్యలపై జరిగిన సమావేశంలో వివిధ అంశాల్ని ప్రస్తావించారు. కామన్ సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించి అన్ని ఉపాధ్యాయ పోస్టులు సూపర్ వైజింగ్ ఎంఈవో, డీవైఈవో పోస్టులు, జూనియర్ లెక్చరర్ల పోస్టుల పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం ఇవ్వాలని, హైస్కూల్ హెడ్మాస్టర్లకు డ్రాయింగ్ పవర్లు మంజూరు చేయాలని కోరారు. డీఎస్సీ ప్రకటన లేకపోవడంతో ఉపాధ్యాయ ఖాళీల్లో ఎకడమిక్ ఇన్స్ట్రక్టర్ల పోస్టులను కేటాయించాలని, దాదాపు 550 అప్‌గ్రేడ్ ఉన్నత పాఠశాలలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు. ప్రాథమిక విద్యకు ఇబ్బందికరంగా ఉన్న 3,4,5 తరగతుల పాఠశాలల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని, ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానున్న ప్లస్ టు విధానానికి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ స్థాయి పదోన్నతి కల్పించి గెజిటెడ్ హోదా ఇవ్వాలని కోరారు. అర్హత గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి ఇవ్వాలని, అన్ని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్‌గా పరిగణించి వేసవి సెలవుల్లో ఎలాంటి కార్యక్రమాలు ఇవ్వకూడదన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో సర్వీసు ద్వారా బదిలీలకు అవకాశం కల్పించాలని, అంతర్ రాష్ట్ర బదిలీల్లో భాగంగా వన్ టైం సెటిల్మెంట్ ద్వారా తెలంగాణ రాష్ట్రం నుంచి ఉపాధ్యాయుల బదిలీ కొరకు అవకాశం ఇవ్వాలన్నారు. కేజీబీవీ టీచర్లకు 2016 నుంచి పెంచకుండా ఉన్న జీతాన్ని మినిమం టైం స్కేల్ ద్వారా పెంచాలని, 12ఏళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ర్యాంకుగా గుర్తించాలని, సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో శాశ్వత సభ్య సంఘాలకు ఓడీ సౌకర్యం పునరుద్ధరించాలన్న తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై అరుణ్‌కుమార్ స్పందిస్తూ తప్పకుండా ప్రభుత్వానికి అన్ని సమస్యలు సానుకూలంగా తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

అంబేద్కర్ పేరు వ్యతిరేకించడం అమానుషం: డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ప్రభుత్వం ప్రకటించిన జిల్లాను వ్యతిరేకిస్తూ, అమలాపురంలో కొంత మంది అరాచక మూకలు విధ్వంసాలకు పాల్పడటం అమానుషమని, వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల విషయంలో ఏమైనా అభ్యంతరాలుంటే, ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమించాలేగానీ, అరాచక పరిస్థితులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రపంచం గర్వించదగిన మేధావి, దేశంలోని అన్ని కులాలు, అన్ని వర్గాల ప్రజలకు ప్రజాస్వామ్య హక్కుల కోసం తన జీవితాన్ని సైతం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ త్యాగం చేశారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పేరును కోనసీమ జిల్లాకు పెట్టడాన్ని సామాజిక విజ్ఞతతో స్వాగతించాలని, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు.

ఎమ్మెల్సీ అనంతబాబును బర్తరఫ్ చేయాలి

అధికార అహంకారంతో దళిత యువకుడిని పాశవికంగా హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును బర్తరఫ్ చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప డిమాండ్ చేశారు. దళిత యువకుడైన సుబ్రహ్మణ్యను హత్య చేసిన కుట్రలో మరెంత మంది ఉన్నారనే దిశగా నిష్పక్షపాతంగా విచారించాలని, లేకుంటే దళిత సంఘాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాయని హెచ్చరించారు. ఈ అంశంపై డీహెచ్‌పీఎస్ అన్ని జిల్లాల్లో దళిత సంఘాలను, ప్రజా సంఘాలను కలుపుకుని, రౌండు టేబుల్ సమావేశాలు, ఇతర ఆందోళనలకు కార్యాచరణ రూపొందించిందన్నారు. అనంతబాబును బర్తరఫ్ చేయకుంటే, జూన్ 2న తలపెట్టిన చలో రాజ్‌భవన్‌కు పెద్దఎత్తున తరలివస్తామని తెలిపారు.

బ్రిటన్‌లో తెలుగు మహిళ అరుదైన ఘనత



విశాలాంధ్ర-గుంటూరు: బ్రిటన్‌లోని కెంట్ ప్రాంతంలో నివసించే ఆంధ్ర ప్రదేశ్‌లోని ఏలూరు పట్టణానికి చెందిన హిమవల్లి చలికొండ అరుదైన అవార్డును అందుకున్నారు. ఐఐడబ్ల్యు షీ ఇన్స్పైర్స్ అవార్డ్స్-2022 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన ఇన్స్పైరింగ్ ఇండియన్ వుమెన్ గ్లోబల్ అవార్డును కమ్యూనిటీ స్పిరిట్ విభాగంలో ఈ నెల 23న బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ పార్లమెంట్‌లో హిమవల్లి అందుకున్నారు. ఈ అవార్డు కోసం వివిధ రంగాల నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 25 దేశాల నుంచి 150 నామినేషన్లు రాగా ప్రతిభ ఆధారి తంగా అనేక సంవత్సరాల నుంచి అభ్యర్థులు క్రమం తప్పకుండా వారు చేస్తున్న నిర్విరామ కృషి ఆధారితంగా ఈ అవార్డును అందచేస్తుంటారు. చివరి రౌండ్‌లో హిమవల్లి చలికొండ మూడవ స్థానంలో నిలిచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు హిమవల్లికి రావడంతో బ్రిటన్‌లో నివసించే తెలుగు వారందరికీ చాలా గర్వించదగిన విషయమని హిమవల్లిని వారంతా అభినందించారు. హిమవల్లి మాట్లాడుతూ 2006 సంవత్సరం నుంచి తెలుగు వారి కోసం సోషల్ మీడియా ద్వారా ఓ కమ్యూనిటీనీ స్థాపించామని తెలిపారు. భారతదేశం నుంచి బ్రిటన్ వచ్చే వారి కోసం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు ఈ కమ్యూనిటీ కింద 9 వేల మంది సభ్యులు ఉన్నారని, పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం, భారతదేశంలో వరదలకు ఇబ్బందిపడిన అనేక ప్రాంతాలకు నగదును అందచేయడం, క్యాన్సర్ రోగులకు వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇచ్చామని, ఒంటరి మహిళల సహాయార్థం ఓ ప్రత్యేకమైన గ్రూప్‌ను ఏర్పాటు చేసి వారికి వెన్నుదన్నుగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా తెలుగు వారికి బ్రిటన్‌లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, వారికి చేతనైన సహాయం చేస్తామని హిమవల్లి తెలియజేశారు.

సంపాదకీయం

అంబేద్కర్ పేరు మీద అభ్యంతరాలా!?

అంబేద్కర్ జయంతినో, వర్ధంతినో జరుపుకోవడానికి చూపే అత్యుత్సాహం ఆయన ఆశయాలను అనుసరించడంలో ఎక్కడా కనిపించడం లేదు. తెలంగాణలో జిల్లాల సంఖ్యను మూడింతలకు పైగా మార్చిన తరవాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లాల సంఖ్యను చాలా ఉదారంగా పెంచేశారు. ఉన్న జిల్లాలను విభజించి జిల్లాల సంఖ్య పెంచడంలోనే అనేక అశాస్త్రీయ లక్షణాలు ఉన్నాయన్న విమర్శలు తలెత్తాయి. కోన సీమను కొత్త జిల్లాగా ఏర్పాటు చేసి దానికి ఇటీవలే డా. అంబేద్కర్ పేరు పెట్టారు. జిల్లాగా ఏర్పాటు చేసిన కోనసీమకు అంబేద్కర్ పేరు పెట్టడంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వెల్లడించవచ్చునని ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. ఆ వ్యతిరేకత విధ్వంసంగా వ్యక్తం కావడం దారుణమైన పరిస్థితి. అంబేద్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం విధ్వంసం చెలరేగడం అంబేద్కర్ మీద మనకు ఏ పాటి గౌరవం ఉందో నిరూపితమవుతోంది. ఈ విధ్వంస కాండలో ఒక పోలీసు వాహనం, ఒక విద్యా సంస్థ వాహనాన్ని దగ్ధం చేయడం కేవలం శాంతిభద్రతలు అదుపు తప్పాయని అనుకుని సరిపెట్టుకోవడానికి అవకాశం లేదు. ముందు కోనసీమ జిల్లా అన్నదానికి తరవాత అంబేద్కర్ జిల్లా అని పేరు పెట్టడం ఎందుకు అభ్యంతరకరమైందో అర్థం చేసుకోవాలంటే ఈ విధ్వంసం వెనక ఉన్న శక్తులు ఏమిటో బయట పెట్టాల్సిందే. విధ్వంసం పర్యవసానంగా పోలీసులు లాఠీ చార్జీ చేయవలసి వచ్చింది. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంతం నిరసనలకు కేంద్రం కావడం యాదృచ్ఛికంగా జరిగిందనుకోలేం. నిరసనకారులు రాళ్లు రువ్వడంవల్ల కనీసం 20 మంది పోలీసులు గాయపడ్డారు. ఇంత పకడ్బందీగా విధ్వంసం జరగడం చూస్తే దీని వెనక పెద్ద కుట్రే ఉందేమో అనిపిస్తోంది. విధ్వంస కార్యక్రమం కేవలం రాళ్లు రువ్వడంతో ఆగలేదు. రాష్ట్ర మంత్రి పి. విశ్వరూప్ ఇంటి మీద దాడి చేసి ఆస్తి ధ్వంసం చేశారు. ఈ దౌర్జన్య కాండలో మంత్రి కుటుంబ సభ్యులు గాయపడకుండా తప్పించుకోవడం దుండగుల ఔదార్యంవల్ల కానే కాదు. చివరకు పోలీసులు మంత్రి కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి చేర్చగలిగారు. దీనికి తోడు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ శాసన సభ్యుడు పొన్నాడ సతీశ్ ఇంటిని కూడా దుండగులు దగ్ధం చేశారు. ఈ సంఘటన తరవాత పోలీసులు 46 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదనపు బలగాలను అమలాపురం పంపించి పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నించారు. ఈ విధ్వంస కాండ వెనక కొన్ని రాజకీయ పార్టీలు, సంఘ వ్యతిరేక శక్తులు ఉన్నాయంటున్నారు. వారే దహన కాండకు కారకులని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అంటున్నారు. అంటే దోషులను నిర్దిష్టంగా గుర్తించకుండా ఉండడానికి ఆమె చేసిన ప్రకటన ఉపకరిస్తుంది. కొన్ని రాజకీయ పార్టీలు, సంఘ వ్యతిరేక శక్తులు అనడంలో ఆమె ఆంతర్యం స్పష్టంగా అసలు దోషులు బయటపడకుండా చూడడమే అయి ఉండవచ్చు. అయినా సమగ్ర మైన దర్యాప్తు చేయిస్తామని, దోషులను కఠినంగా శిక్షిస్తామని ఆమె వాగ్దానం చేయడాన్ని ఆమె పైకి చెప్పే మాటల ఆధారంగా అర్థం చేసు కోవలసిన అవసరం లేదని అర్థమవుతోంది. కోనసీమ సాధనా సమితి అంబేద్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకించారు. కోనసీమ అన్న పేరే ఉంచాలన్నది వారి అభిప్రాయం. అంబేద్కర్ పేరు పెట్టడాన్ని నిరసిస్తూ కోన సీమ సాధనా సమితి మంగళవారం ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన నిరస నోద్యమం రక్తసిక్తం అయింది. కోనసీమ సాధనా సమితి జిల్లా కలెక్టర్‌కు ఓ విజ్ఞాపన పత్రం అందజేయాలనుకున్నారు.

అమలాపురంలో జరిగిన విధ్వంసం వెనుక అమలాపురానికి చెందిన అన్యం సాయి ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అమలాపురం స్టేషన్‌కు తరలించారు. విధ్వంసంపై అతడిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సాయిపై ఇప్పటికే రౌడీషీట్ తెరిచారు. కొత్త జిల్లాగా ఏర్పడిన కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడాన్ని హర్షిస్తూ ఒక వర్గం హర్షం వ్యక్తం చేస్తే మరో వర్గం విధ్వంసానికి దిగింది. కోనసీమ అన్న పేరే ఉంచాలని ఉద్యమానికి దిగారు. మంగళవారం నాటి విధ్వంసానికి ముందే ఈ నెల 19న తెల్లవారుజామున అయినవిల్లి మండలం శానపల్లి లంకగ్రామంలో స్థానిక ప్రజలు, కొందరు వైసీపీ నేతలు సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగారు. జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి శవయాత్ర నిర్వహించడం కలకలం రేపింది. 20వ తేదీన కోనసీమ జిల్లా పేరును కొనసాగించాలంటూ జేఏసీ నేతలు అమలాపురం కలెక్టరేట్ ముట్టడికి పిలుపిస్తే 5 వేల మంది వరకు తరలివచ్చారు. దీన్నిబట్టి అంబేద్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నది ఏ రాజకీయ పక్షమో అర్థం అవుతూనే ఉంది. ఇప్పుడు పోలీసులు నిందితుడు అని నిర్బంధంలోకి తీసుకున్న అన్యం సాయి పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిం చాడు. నిజానికి సాయి వైసీపీ క్రియాశీల కార్యకర్త. మంత్రి విశ్వరూప్‌కు అనుచరుడు అని కూడా అంటున్నారు. ఆయనకు మంత్రి పదవి వచ్చి నప్పుడు అభినందనలు తెలియజేస్తూ పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చాడు. అంబేద్కర్ పేరు మార్చాలన్న ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడంటున్న సాయి వల్ల మంగళవారం జరిగిన సంఘటనల వెనక వైసీపీ నేతల పాత్రపై అనుమానాలు కలుగుతున్నాయి. దీనికితోడు కోనసీమ జిల్లా పేరు కొనసాగించాలంటూ ఆందోళనలు చేసేవారిని పోలీసులు 20వ తేదీ నుంచి ఎక్కడికక్కడ అరెస్టు చేయడం మొదలుపెట్టారు. అయినా మంగళవారం విధ్వంసం జరగకుండా నిరోధించలేకపోవడం విడ్డూరమే. ఈ నేపథ్యంలోనే జేఏసీ సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపు నిచ్చింది. కానీ పోలీసులు 144 సెక్షన్ పెట్టి ఎవరూ రాకుండా అడ్డుకున్నారు. ఆగ్రహంతో రగిలిపోయిన జేఏసీ మళ్లీ మంగళ వారం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా పేరు మార్పునకు సంబంధించిన అభ్యంతరాలతో పెద్దఎత్తున వినతి పత్రాలివ్వాలని పిలుపిచ్చింది. దీంతో పోలీసులు అమలాపురమంతటా 144 సెక్షన్ విధించారు. పట్టణంలో బారి కేడ్లు, ఇనుప కంచెలు వేశారు. కోనసీమలోని నేతలను గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో వారి కార్యక్రమం విఫలమైందేనని పోలీసులు భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా విధ్వంసకాండ చెలరేగింది. అంబేద్కర్ పేరు ఒక కొత్త జిల్లాకు పెట్టడం అభ్యంతరకరం కావడం విచిత్రమే. రాజకీయ రంగులతో నిమిత్తం లేకుండా అన్ని రాజకీయ పార్టీలూ అంబేద్కర్ పేరు వాడుకోవడానికి ఒక్క అవకాశాన్ని అయినా వదులుకోవు. ఈ దేశంలో బహుశా గాంధీ విగ్రహాలకంటే అంబేద్కర్ విగ్రహాలే ఎక్కువేమో. అలాంటిది కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడం ఎవరికైనా ఎందుకు అభ్యంతరం అవుతోందో అంతుపట్టని వ్యవహారంగానే మిగిలిపోతోంది. అభ్యంతరాలు ఉన్నవారు విధ్వంసానికి దిగకుండా తమ వైఖరి తెలియజేసి ఉంటే ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించినట్టయ్యేది.

రైతుకు నష్టం- కార్పొరేట్లకు లాభం

డా. సోమ మర్ల

దేశంలో ఎక్కడైనా అధిక ధరలకు అమ్ముకొనే స్వేచ్ఛ ఉంటుందని రైతుల ఆదాయం పెంచడానికే మూడు వ్యవసాయ చట్టాలను ప్రవేశపెడుతున్నానని రెండేళ్ల క్రితం ప్రధాని మోదీ ప్రకటించారు. ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో పెరిగిన గోధుమ ధరల ద్వారా రైతులకి లభించగల మెరుగైన ఆదాయంపై నీళ్లు జల్లి ఎగుమతులపై నిషేధం విధించి చెప్పిన వాగ్దానాలకి భిన్నంగా వ్యవహరించారు ప్రధాని. ప్రపంచ గోధుమ విపణిలో రష్యా 18 శాతం, ఉక్రెయిన్ 12 శాతం వాటా కలిగి ఉండేవి. ప్రస్తుతం యుద్ధ వాతావరణంలో సముద్ర రవాణా, సరఫరా గొలుసులు విచ్ఛిన్నం అవడం వలన 2018లో టన్నుకు 160 అమెరికా డాలర్లుండగా మే నెలలో 450 డాలర్లకు అమాంతం పెరిగిపోయింది. గత సంవత్సరం ఈ ఏడాది 31.5 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండించగా, ఇటీవలి రబీ గోధుమ దిగుబడులు కొంత మేరకు తగ్గినా, (మార్చి వేసవి వేడి కారణంగా) ఉత్పత్తి 10.6 కోట్ల టన్నులకు చేరుకున్నది. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) గోదాముల్లో 1.9 కోట్ల టన్నులు (గోధుమ 0.74 కోట్లు, వరి 1.35 కోట్ల టన్నులతో) నిండి ఉంది. సాధారణంగా ఉండవల్సిన నిల్వ సామర్థ్యం కన్నా ఇది దాదాపు మూడు కోట్లు ఎక్కువ.

ప్రస్తుతం ప్రపంచ విపణిలో ఆకర్షణీయంగానున్న గోధుమ ధరలతో భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ మే నెల ఒకటవ తేదీ నుండి 2.0 కోట్లు టన్నుల వరకు ఈజిప్టు, బెనిన్, ద.కొరియా తదితర దేశాలకు గోధుమలను ఎగుమతి చెయ్యగలమని ప్రకటించింది. అవకాశాలను అన్వేషించి ఎగుమతి కాంట్రాక్టులను కుదుర్చుకోవటానికి వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆయా దేశాలకు ప్రతినిధి వర్గాలను సైతం పంపింది. ఈ నెల మొదటి వారంలో యూరప్ పర్యటన సందర్భంగా భారత్ గోధుమలను ఎగుమతి చేసి ప్రపంచ ఆహార సమస్య నుండి గట్టెక్కించగలదని గర్వంగా చెప్పుకొచ్చారు. ఈ ఎగుమతుల ద్వారా దాదాపు 10 బిలియన్ల అమెరికా డాలర్లను ఆర్జించవచ్చని ప్రభుత్వం ఆశించింది. ప్రపంచ విపణిలో పలికిన గోధుమ ధరలు దేశీయంగా ధరలను కూడా బాగా (10 శాతం మేరకు కిలో గోధుమ పిండి రూ.40కి) పెంచివేశాయి. గత కొద్ది సంవత్సరాలుగా ప్రకటించిన మద్దతు ధర (2015 క్వింటాలుకు) సైతం లభించక చౌకగా అమ్ముకుని, సాగు ఖర్చులు సైతం రాక నష్టపోయిన రైతాంగం సహజంగానే మెరుగైన ఆదాయం లభిస్తుందని ఆశపడ్డారు. కాగా ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరగటంతో టోకు వ్యాపార ద్రవ్యోల్బణం దాదాపు 15 శాతానికి (రిటైల్ 8 శాతానికి) చేరటంతో కేంద్ర ప్రభుత్వం దీనిని సాకుగా చూపి గోధుమ ఎగుమతులను నిషేధించింది. దీంతో కాండ్ల తదితర రేవుల్లో ఎగుమతి అవుతున్న గోధుమ నిల్వలు ఆగిపోయాయి. ప్రభుత్వం ఈజిప్టు తదితర దేశాలలో ఇప్పటికే చేసుకొన్న ఒప్పందాల్లో సగం కూడా (దాదాపు 0.8 కోట్ల టన్నులు మాత్రమే) ఎగుమతి కాలేదు. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో టన్ను గోధుమ ధర రూ.2,400 నుండి రూ.2,100కి పడిపోయింది. రైతాంగం తీవ్రమైన నిరాశకు గురయ్యారు. అనేక ప్రపంచ దేశాలు, జి.7 వంటి కూటములు భారత చర్యను తీవ్రంగా తప్పు పట్టాయి. ప్రపంచ గోధుమ మార్కెట్‌లో 2020 వరకు మన వాటా కేవలం 0.54 శాతంగా ఉంటూ ఇటీవల సంవత్సరాల్లోనే మనం పుంజుకోవటం ప్రారంభించాం. ఈ దశలో నిషేధం విధించటం వల్ల నిలకడైన ఎగుమతిదారుగా మనకున్న ఖ్యాతి మసకబారింది.



ప్రభుత్వ గోధుమల సేకరణ 22-23లో 53 శాతం పడిపోయింది

ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంలోని విపత్కర పరిస్థితి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార ధాన్యాల నిల్వలు కేవలం రెండు నెలలకే సరిపోతాయని, గోధుమలను దిగుమతి చేసుకొనే దేశాల్లో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడగలదని ప్రపంచ ఆహార సంస్థ (ఎఫ్.ఎ.ఒ) ప్రకటించిన మరుసటిరోజే మన కేంద్ర ప్రభుత్వం గోధుమ ఎగుమతులను నిషేధించింది. అతి త్వరలోనే అంతర్జాతీయ విపణిలో గోధుమ ధరలు మరింత ప్రియం కాగలవని తెలియగానే నిషేధం విధించిందని అర్థమవుతోంది. అతి సమీప భవిష్యత్‌లో పెరుగనున్న గోధుమ ధరలతో దేశీయ ఎగుమతిదార్లకు, హోల్‌సేల్ ధాన్య వ్యాపారులకు అధిక లాభాలు వచ్చేటందుకే ఈ చర్య తీసుకొన్నారని గ్రహించాలి.

తగ్గిన సేకరణ

పేదలకు చౌక దుకాణాల ద్వారా సరఫరా చేసేందుకు ప్రభుత్వం గత సంవత్సరం 4.34 కోట్ల టన్నుల గోధుమలను సేకరించగా, రబీ సీజను అనంతరం మే రెండవ వారాంతానికి వార్షిక సేకరణ కేవలం 1.9 కోట్ల టన్నులుగా ఉంది. ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసే అంత్యోదయ, గ్రామీణ పేదల ఆహార పథకాలపైనా, చౌక ధరలకు సరఫరా చేసే పంపిణీ వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న పేదల ఆహారపు సరఫరాపై దీని ప్రభావం ఉండగలదు.

నిషేధం వెనుక అంతరార్థం

ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంలోని విపత్కర పరిస్థితి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆహార ధాన్యాల నిల్వలు కేవలం రెండు నెలలకే సరి పోతాయని, గోధుమలను దిగుమతి చేసుకొనే దేశాల్లో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడగలదని ప్రపంచ ఆహార సంస్థ (ఎఫ్.ఎ.ఒ) ప్రకటించిన మరుసటి రోజే మన కేంద్ర ప్రభుత్వం గోధుమ ఎగుమతులను నిషేధించింది. అతి త్వరలోనే అంతర్జాతీయ విపణిలో గోధుమ ధరలు మరింత ప్రియం కాగలవని తెలియగానే నిషేధం విధించిందని అర్థమవుతోంది. అతి సమీప భవిష్యత్‌లో పెరుగనున్న గోధుమ ధరలతో దేశీయ ఎగుమతిదార్లకు, హోల్‌సేల్ ధాన్య వ్యాపారులకు అధిక లాభాలు వచ్చేటందుకే ఈ చర్య తీసుకొన్నారని గ్రహించాలి.

మన దేశం నుండి విదేశాలకు ఆహార ధాన్యాలను, ఇతర ఆహారోత్పత్తులను ఎగుమతి చేసే రెండు కాంట్రాక్టు బహుళజాతి సంస్థలు ఐ.టి.సి, కార్గిల్. ఆహార ధాన్యాల ప్రపంచ వాణిజ్యాన్ని కార్గిల్, బుంజె, డ్రేఫస్, ఎడిమ్ అనే నాలుగు పశ్చిమ దేశాల బహుళజాతి సంస్థలు 70 నుండి 90 శాతం వరకు నిర్దేశిస్తాయి. రెండు సంవత్సరాల క్రితం ప్రకటించిన మూడు సాగు చట్టాల్లోని నిత్యావసర సరకుల చట్ట సవరణ టోకు వ్యాపారం, ఎగుమతులు నిర్వహించే కంపెనీలకు కొనుగోళ్లు, నిల్వల పరిమితులపై ఉన్న ఆంక్షలన్నిటినీ రద్దు చేసింది. పరిస్థితిని ముందుగానే పసిగట్టిన రిలయన్సు, అదానీ, ఐటీసీ వంటి పెద్ద కంపెనీలు ఏప్రిల్, మే మాసాల్లో పంట సీజనులో రైతుల నుండి మార్కెట్‌లో కొని మిలియన్ల కొద్దీ గోధుమలను, ఆవాలను, సోయా, మొక్కజొన్న నిల్వ చేశారు. అదానీ సంస్థ హర్యానాలో, రిలయన్సు లూథియానాలో అపారమైన (మిలియను టన్నుల) ఆహార ధాన్యాలను, వంట నూనెల నిల్వ సామర్థ్యం కల గోదాములను, ప్రైవేటు రైల్వే లైన్లను నిర్మించుకున్నారు. గత కాంగ్రెస్, ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వాలు రైతులను నష్టపర్చి, కార్పొరేటు కంపెనీలకు మేలు చేకూర్చే మార్కెటింగ్, నిల్వ, సంఫరా ప్రైవేటీకరణ విధానాలే కొనసాగిస్తున్నాయి. ఇటీవల ప్రతిపాదించి, రైతుల ఆందోళనతో వెనక్కి తీసుకున్న సాగు చట్టాలు మొత్తం వ్యవసాయ రంగాన్ని పెద్ద కార్పొరేటు కంపెనీలకు కట్టబెట్టటానికి నిర్దేశించినవే. వారి ప్రయోజనాలను తీర్చేటందుకే ప్రస్తుతం గోధుమ ఎగుమతులపై నిషేధం విధించారు.

బీదల జీవన పరిమితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వెంటనే పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ మాదిరిగా రూ.500ల బోనస్‌ను (క్వింటాలుకు) ప్రకటించాలి. వివిధ రైతు సంఘాలు డిమాండు చేస్తున్న విధంగా మద్దతు ధరలను సాగు ఖర్చులు భరించేలా రూ.2,800 కు పెంచాలి. దీని ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం చేకూరటమే కాక ప్రభుత్వ ఆహార పంపిణీ వ్యవస్థ పటిష్ఠం కాగలదు.

ఐ-మెయిల్

అమలాపురంలో చెలరేగిన హింస గర్హనీయం

అమలాపురంలో కోనసీమ పరిరక్షణ పేరిట జరుగుతున్న నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారడం అత్యంత బాధాకరం. గర్హనీయం. చెలరేగిన మూకలు మంత్రి, ఎమ్మెల్యేల గృహాల్ని, బస్సుల్ని తగల బెట్టడం, జిల్లా పోలీసు ఉన్నతాధికారితో బాటు పదుల సంఖ్యలో పౌరులు గాయపడడం మనసుని కలచి వేసిన చర్య. ప్రశాంతతకు నెలవైన రాష్ట్రంలో, అందులోనూ శాంతిసామరస్యాలకు పేరుపడిన కోనసీమ ప్రాంతంలో ఇలా జరగడం అందరినీ ఉలిక్కి పడేలా చేసింది. ఇలాంటి దుందుడుకు ఘటనల్ని ప్రభుత్వం ఆదిలోనే తుంచి వేయాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇలాంటి పెడ పోకడలకు రాష్ట్రం అన్నివిధాలా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. కోనసీమకు బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అన్ని రాజకీయ పక్షాలూ మద్దతు తెలిపాయి. ఆ మహనీయుని పేరు పెట్టడానికి నిజానికి ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండనక్కర లేదు. ఆయన దేశమే గర్వించదగ్గ ప్రపంచ స్థాయి మేధావి. విశ్వనాయకుడు. దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో పలు ఉన్నత సంస్థలు ఆయన పేరు పెట్టుకుని గౌరవించుకుంటున్నాయి. కోన సీమ జిల్లాకు అంబేద్కర్ పేరుపై రగడ జరుగుతోంది. 'మా జిల్లాకు కోనసీమ పేరే ఉంచాలం'టూ నిరసనలు మొదలయ్యాయి. నిరసన అన్నది ప్రజాస్వామిక హక్కు కాబట్టి అవి శాంతియుతంగా జరిగితే తప్పులేదు. ఆ నిరసనల వెనుక సంఘ విద్రోహశక్తులు చొరబడితే, వాటిని ఆయా సంఘాల నేతలు నియంత్రించలేక పోతే ఇలాంటి ప్రమాదాలే ఎదురౌతాయి. శాంతియుత వాతావర ణాన్ని భగ్నం చేస్తాయి. కాబట్టి పౌరసంఘాలు, పోలీసు యంత్రాంగం అప్ర మత్తంగా ఉండాలి. ఈ అల్లర్ల వెనుక దోషు ల్ని గుర్తించి బోనెక్కించాలి. అశాంతి ప్రబలకుండా కట్టడి చెయ్యడంలో అన్ని రాజకీయ పార్టీలూ బాధ్యత వహించాలి. రాజకీయ ప్రయోజనాల ప్రాతిపదికన విమర్శా ప్రతివిమర్శలు గాడి తప్పకుండా స్వీయనియంత్రణ పాటిం చాలి. ఒక సామాజిక అంశం రాజకీయపు రంగు సంతరించుకొంటే నష్టపోయేది సమాజమే. చలి కాచుకునేది సంఘ విద్రోహులే.

డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, 9440836931.

23 ఏళ్ళను మించిన సంపాదన రెండేళ్ళల్లోనే!!

ఎస్. బాల్ రాజ్



కరోనా కాలం 24 నెలల్లో బిలియనీర్లు ఆర్జించిన మొత్తం సంపద గడిచిన 23 ఏండ్ల సంపాదన కంటే ఎక్కువ. ప్రపంచ కుబేరుల సంపద ప్రపంచ జీడీపీలో 13.9 శాతానికి సమానం. ఇది 2000 సంవత్సరంలో 4.4 శాతంగా ఉండగా గడిచిన 22 ఏండ్లలో మూడింతలు అయ్యింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఈఎఫ్) సదస్సులో నివేదికను విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ ప్రపంచ అసమానతలపై ఎన్నో వివరాలు వెల్లడించింది. కోవిడ్ కష్టకాలంలో ప్రతి 30 గంటలకు ఒక కొత్త బిలియనీర్ పుట్టుకురాగా, దాదాపు 10 లక్షల మంది కడు పేదరికంలోకి జారు కుంటున్నారని ఆ నివేదిక హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా గడిచిన కొన్ని దశాబ్దా లలో ఎన్నడూ లేనంత వేగంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ఆహారం, ఇంధన రంగాలకు చెందిన బడా పారిశ్రామిక వేత్తల బిలియనీర్ల సంపద ప్రతి 2 రోజులకు ఒక బిలియన్ డాలర్ల చొప్పున పెరిగిందని నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం పేదలను ఆర్థికంగా చితికిపోయేలా చేసి పారిశ్రామిక వేత్తలు తమ సంపద పెంచుకున్నారు.

కరోనా కారణంగా రెండేళ్ళ తర్వాత డబ్ల్యుఇఎఫ్ సదస్సు జరుగుతోంది. ఈ కష్ట కాలంలో పారిశ్రామిక వేత్తలు, గుత్త పెట్టుబడిదారులు, బడా వ్యాపారస్తులు ప్రపంచ బిలియనీర్లు దావోస్ చేరుకొని మరింతగా తమ ఆస్తులను, సంపదను పెంచుకునేందుకు సంతోషంతో ఉత్సాహంతో ప్రణాళికలు వేసుకుంటున్నారు. కనీసం 100 కోట్ల డాలర్లు అనగా 7750 కోట్ల సంపద కలిగిన వారిని బిలినీయర్‌గా పిలుస్తారు. కరోనా ప్రారంభ సంవత్సరం 2020లో 573 మంది కొత్తగా బిలియనీర్లుగా అవతరించారు. అంటే 573×7750=44,40,750 కోట్లు. ప్రతి 30 గంటలకు ఒక బిలియనీర్ పుట్టుకొచ్చారు. ఇదే ఏడాది 26.3 కోట్ల మంది అనగా ప్రతి 33 గంటలకు దాదాపు 10 లక్షల మంది కడు పేదరికంలోకి కూరుకుపోయారు.

ఇంధనం, ఆహారం, ఫార్మ రంగాల్లో గుత్తాధిపత్యం కలిగిన కంపెనీలు రికార్డు గరిష్ట లాభాలు నమోదు చేసుకుంటుండగా వేతనాలు పెరుగుదల మాత్రం అతి స్వల్పం. కరోనా కాలంలో కార్మికులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారు పనులు లేక భారీగా నష్టపోయినా మన కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన ఆర్థిక వెసులు బాటు కలిగించలేదు. ప్రపంచంలో అతి పెద్ద ఇంధన దిగ్గజాలైన బిపి, షెల్, టోటల్ ఎనర్జీస్, ఎక్సాన్, షెవ్రాన్ కంపెనీల మొత్తం లాభం ప్రతి సెకనుకు 2600 డాలర్లుగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో ఆహార రంగం నుంచి 62 మంది బిలియనీర్లు అయ్యారు. కార్గిల్ మరో 3 కంపెనీలు ప్రపంచ అగ్ర మార్కెట్‌లో 70 శాతం వాటాను శాసి స్తున్నాయి. కార్గిల్ కంపెనీ ప్రమోటర్ల కుటుంబంలో కరోనాకు ముందు 8 మంది బిలియనీర్లు ఉండగా ప్రస్తుతం 12కు పెరిగింది. ఫార్మరంగంలో 40 మంది బిలియ నీర్లుగా అవతరించారు. మోడెర్న, ఫైజర్ వంటి బడా ఔషధ కంపెనీలు సెకనుకు వెయ్యి డాలర్ల లాభాన్ని ఆర్జించాయి. జనరిక్ ఔషధ ధర కంటే ఆ కంపెనీలు 24 రెట్లు లాభాలు వసూలు చేశాయి.

ప్రపంచంలోని 2668 బిలియనీర్ల మొత్తం సంపద 12.7 లక్షల కోట్ల డాలర్లు. క్రితం ఏడాదితో పోలిస్తే 3.78 లక్షల కోట్ల డాలర్లు పెరిగింది. ప్రపంచంలోని టాప్-10 కుబేరుల ఆస్తి, ప్రపంచ జనాభాలోని దిగువ 40 శాతం (310 కోట్లు) కలిగి ఉన్న మొత్తం సంపద కంటే అధికం. టాప్-20 బిలియనీర్ల ఆస్తి విలువ సబ్ సహారా ఆఫ్రికా జీడీపీ కంటే అధికం. ఒక శాతంలో ఉన్న కుబేరుడైన వ్యక్తి ఏడాది సంపాదనకు సమానంగా ఆర్జించాలంటే దిగువ 50 శాతానికి చెందిన కార్మికుడు 112 ఏండ్లు పని చేయాల్సి వుంటుంది. ధనికులపై సంపద పన్ను విధించాలని, మిలియనీర్లపై 2 శాతం, బిలియనీర్లపై 5 శాతం సంపద పన్ను విధించటం ద్వారా ఏటా 2.52 లక్షల కోట్ల డాలర్ల ఆదాయం సమకూరుతుందని పేర్కొంది. దీంతో ప్రపంచంలోని 230 కోట్ల మందిని పేదరికం నుంచి గట్టెక్కించవచ్చునని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. అల్పాదాయ దేశాల్లోని 87 శాతం ప్రజలకు ఇప్పటికీ రెండు డోసుల కోవిడ్ టీకాలు అందలేదు. రెండేళ్ళలో కోవిడ్ కారణంగా 2 కోట్లకు పైగా పేదలు చనిపోయి ఉండొచ్చని అంచనా.

శ్రీలంక నుంచి సూడాన్ వరకు ప్రస్తుతం జరుగుతున్న సామాజిక, రాజకీయ తిరుగుబాటుకు భగ్గుమంటున్న ధరలే కారణం. అల్పాదాయ దేశాల్లో 60 శాతం రుణ సంక్షోభంలోకి జారుకునేలా ఉన్నాయి. ధనిక దేశాలతో పోలిస్తే పేద దేశాల్లోని ప్రజలు ఆహారం కోసం తమ ఆదాయంలో రెట్టింపునకు పైగా ఖర్చు చేస్తున్నారు.

పెట్టుబడిదారుల ఆస్తులు ఇంతగా పెరిగాయంటే పేదల నుండి శ్రమ దోపిడీ ఎంతగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. కార్మికులు తమ పని దినాలను కోల్పోవటమే కాకుండా కనీస కార్మిక చట్టాల అమలుకు నోచుకోకుండా, హక్కులు లేకుండా తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. ఈ పరిస్థితులు మారాలంటే, కార్మికులు పేదల జీవితాలు మెరుగుపడాలంటే పోరాటాలు, ఉద్యమాలే శరణ్యం.

వ్యాస రచయిత ఎఐటియుసి తెలంగాణ
రాష్ట్ర అధ్యక్షులు, 8074246685

కడప గడపలో..

బాబ్జీ, సినీ దర్శకుడు

పల్లవి :
కడప గడపలో..
ఖణ ఖణ ఖణ ఖణ
గడప గడపలో..
ఘణ ఘణ ఘణ ఘణ
కడప గడపలో..
గడప గడపలో..
కళా ఉత్సవాలు
ప్రజా కళల సంబరాలు
ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి
రాష్ట్ర మహాసభలు...!
పదవ రాష్ట్ర మహాసభలు..!
చలోరే చల్..
చలోరే చల్.. ॥ కడప ॥

చరణం : 1
చందమామను గొంగళి చేసి
సూర్యుణ్ణి తెచ్చి తప్పెట చేసి
పల్లె పదాలకు గజ్జెను కట్టి
వీధి నాటకాలాడిన వీరులు
కడపకు వస్తున్రు..!
కళలను మోసుకు వస్తున్రు..!
ఉరుకుతు వస్తున్రు..!
ఉద్యమ పాటలు తెస్తున్రు..!
చలోరే చల్..
చలోరే చల్.. ॥ కడప ॥

చరణం : 2
కళ కోసమే కళ కాదంటారు
ప్రజల కోసమే కళ అంటారు
రెండు చేతులను చాచి నిల్చొని
విప్లవాన్ని మరి ఆహ్వానిస్తరు
పాటై వస్తున్రు..!
పేదల మాటై వస్తున్రు..!
పోరై వస్తున్రు..!
దప్పుల దరువై వస్తున్రు..!
చలోరే చల్..
చలోరే చల్.. ॥ కడప ॥

చరణం: 3
మట్టి మనుషులను ఒక్కటి చేసి
పోరాటాల బాటన నడిపిన
ఎర్ర సేనకు తోడుగ కదిలి
వైజయంతికలు ఎత్తిన గొంతులు
దూలా అంటున్రు..!
తప్పెట గుళ్లతో వస్తున్రు..!
సుద్దులు చెబుతున్రు..!
బుర్ర కథలై వస్తున్రు..!
చలోరే చల్..
చలోరే చల్.. ॥ కడప ॥

పిలుస్తోంది ప్రజా నాట్యమండలి

సబ్బి కనకారావు, 9848383376

పిలుస్తోంది ప్రజా నాట్యమండలి
ప్రజా కళల ఉద్ధృతికిది పునాది
మరుగుపడ్డ జానపదుల కళలన్ని వెలికి తీసి
మెరుగుపెట్టి సామాజిక సమస్యలను జోడించీ
ప్రజారంజకంగా పాడి పేరు పొందె జనవాణి ॥ పిలు ॥

సామాన్య యువకుల్ని కూడగట్టి భుజం తట్టి
శిక్షణాశిబిరాల్లో రంగరించి రాటు తేల్చి
మట్టి నుంచి మాణిక్యాలెన్నో ఎన్నెన్నో తీసి
రాళ్ళను రాపిడిచేసి రత్నాలుగా చేసి
చరిత్రలో నిలిపింది చిరకీర్తిని పొందింది ॥ పిలు ॥

ప్రజావుద్యమాలకెపుడు వెన్నుదన్నుగా నిలిచే
శ్రమ జీవుల జీవితాలు కథలు కట్టి ఆడిపాడి
పేద ప్రజల పక్షమే మా లక్ష్యమనీ చాటింది
సమసమాజమే ధ్యేయం సకల జనుల సౌభాగ్య
కళలను రూపొందించిన కరదీపిక ఈ వేదిక ॥ పిలు ॥

కవులూ గాయకులు నటులు కార్యోన్ముఖులవ్వాలి
కళలకున్న పరమార్థం అందరికీ తెలపాలి
మూఢనమ్మకాలు వదిలి మునుముందుకు సాగాలి
కుల మతాల కతీతంగా దేశ ప్రగతి సాగాలి
ప్రజానాట్య మండలి ధ్యేయం నెరవేరాలి ॥ పిలు ॥

పోరుబాట

జంగాల అజయ్‌కుమార్

పాటకు ప్రాణమై - మాటకు రూపమై
ప్రజల కొరకు గజ్జె కట్టి - దప్పుకొట్టి ప్రశ్నించిన
ప్రజా పోరాటాలకు - ప్రేరణగా నిలచిన
ప్రజానాట్యమండలి - ప్రజాహృదయ ప్రతిధ్వని
నీ బాంఛన్ దొర - కాల్మొక్త అన్న నోళ్ల నుండి
దొరతనాన్ని ప్రశ్నించి - దురాగతంపై పోరిన
పాట తోటి - మాట తోటి - ప్రజలను సాయుధులను చేసిన
సాయుధ రైతాంగ పోరుకు ప్రేరణై నిలిచిన
ఆకలి మంటలలో - అలమటించు అన్నార్తుల
గొడ్డుచాకిరి చేసిన - పూట గడవని జీవుల
జీవితాలు చిగురించగ - జరుగుచున్న రణానికి
మాటై, పాటై గజ్జె కట్టి గర్జించిన
ప్రజానాట్యమండలి - ప్రజా పోరుగర్జని
కులమతాల ఉన్మాదం - పెంచుతున్న దుర్మార్గుల
నిజరూపం తెలియజేసి - సమతా మమతల కోసం
ప్రజలను మేల్కొలిపిన సమరశీల
సాంస్కృతిక పోరాట స్రవంతి
ప్రజానాట్యమండలి - ప్రజాపోరు గర్జని
కార్పొరేట్ శక్తుల - అసలు రంగు తెలియజెప్పి
అందరి కోసం సంపదని - కొందరే దోచుకునే
దుర్మార్గం తెలియజెప్పి- పాటతో కర్తవ్యం
ప్రజలకు తెలిపి - కళారూపాలతో జాగృత పరిచే
ప్రజానాట్యమండలి - పోరు బాట పల్లవి

సంస్కరణలకు హామీ ఇచ్చినా
ఆగని వలసలు

అందరినీ సంతృప్తిపర్చని చింతన్ శిబిర్
నేతల బుజ్జగింపులో అధిష్ఠానం విఫలం

న్యూఢిల్లీ : వ్యవస్థాగతంగా మార్పులు, చేర్పులు చేసుకోవాలని, పార్టీని మరింత బలపర్చుకోవాలని, యువతకు ప్రాముఖ్యత ఇవ్వాలని రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో కాంగ్రెస్ హామీలిచ్చినా సొంత నేతల వలసలను ఆపడంలో విఫలమవుతోంది. ఇద్దరు ప్రముఖ నేతలు సునీల్ ఝాకర్, హార్దిక్ ఇటీవల పార్టీని వీడారు. బుధవారం పార్టీ సీనియర్ నాయకుడు కపిల్ సిబాల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. చింతన్ శిబిర్ సమయంలో ఇద్దరు నాయకులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పడం చర్చనీయాంశంగా మారింది. సమూల మార్పులకు ఇచ్చిన హామీలు నేతలను సంతృప్తిపర్చలేదని పార్టీలోని ఓ వర్గం భావిస్తోంది. శిబిర్ నేపథ్యంలో కాంగ్రెస్ నేత శశిథరూర్ మాట్లాడుతూ, 'సంస్కరణల ప్రక్రియ ఎలా పరిణమిస్తుందో వేచిచూడాలి' అని అన్నారు. పార్టీలో భారీ సంస్కరణలను కోరుతూ 2020లో అధినేత్రికి లేఖ రాసిన 23 మంది నేతల్లో థరూర్ ఉన్నారు. శిబిర్ జరుగుతుండగానే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కాషాయ కండువాను ఝాకర్ కప్పుకున్నారు. పాటిదార్ కోటా ఉద్యమ నేత పటేల్ మాత్రం ఇంకా ఏ పార్టీలో చేరలేదు. ఆయన శిబిర్‌కూ హాజరు కాలేదు. తమ పార్టీ నేతలను బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దగా కసరత్తు చేయడం లేదన్నట్లుగా తోస్తోంది. సిద్ధాంతాల ఈ పోరాటంలో బీజేపీ నుంచి ఒత్తిళ్లకు తలొగ్గేవారెవ్వరైనా సరే పార్టీని వీడవచ్చు అని అంతర్గత పార్టీ ఫోరాల్లో రాహుల్ గాంధీ చెబుతూనే ఉన్నారు. గతంలో పార్టీని వీడిన ఇతర నేతలు ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్నారు. అంతర్గతంగా చర్చలు జరపడాన్ని కాంగ్రెస్ ఆపేసిందని పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఓ నేత తెలిపారు. ఈ మధ్యనే అసోం పీసీసీ మాజీ అధ్యక్షుడు రిపున్ బోరా, కేంద్ర మాజీ మంత్రులు అశ్వని కుమార్, ఆర్‌పీఎన్ సింగ్, గోవా మాజీ సీఎం ల్యుజింగ్‌హో ఫలేరే, రాజ్యసభలో చీఫ్ విప్ భువనేశ్వర్ కలితను కాంగ్రెస్ కోల్పోయింది. సీనియర్ నేతలు జితిన్ ప్రసాదా, జ్యోతిరాదిత్య సింధియా, సుష్మితా దేవి, సీసీ చాకో కూడా గతంలో పార్టీని వీడారు. ఝాకర్, పటేల్ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇన్నేళ్ల బంధుత్వాన్ని తెంచుకోవడం సులువుకాదుగానీ పార్టీ అధిష్ఠానం వైఖరి నచ్చకనే బయటకు వెళుతున్నట్లు రాజీనామా లేఖల్లో పేర్కొన్నారు.

చింతన్ శిబిర్ తీర్మానాన్ని దశలవారీగా ఆచరించేందుకు మూడు గ్రూప్‌ల టాస్క్‌ఫోర్స్‌ను మంగళవారమే అధినేత్రి ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం వ్యూహాన్ని రూపొందించడంలోనూ ఈ టాస్క్‌ఫోర్స్ సహకరిస్తుందని, పార్టీని ఎన్నికలకు సిద్ధం చేస్తుందన్నారు.

ఐదు నెలల్లో ఐదుగురి నిష్క్రమణ

- కాంగ్రెస్‌లో ఆందోళన
- పార్టీని వీడిన కపిల్ సిబల్

న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పార్టీని పునర్జీవింప చేసేందుకు నానా తంటాలు పడుతున్న కాంగ్రెస్ పార్టీకి నేతల నిష్క్రమణ ఆందోళన కలిగిస్తోంది. బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎలా అనే చింత తీర్చుకునేందుకు కాంగ్రెస్ 'చింతన్ శిబిర్' నిర్వహించినప్పటికీ వరుస ఎదురుదెబ్బలు ఎదుర్కొంటూనే ఉంది. గత ఐదు నెలల్లో కొంతమంది నాయకులు పార్టీని వీడారు. తాజాగా ప్రముఖ నేత కపిల్ సిబల్ కూడా పార్టీని వీడటంతో గత ఐదు నెలల్లో ఐదుగురు నేతలు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించినట్లయింది. వారి రాజకీయ తీరుతెన్నులను పరిశీలిస్తే...

కపిల్ సిబల్ :

న్యాయవాది-రాజకీయవేత్త అయిన సిబల్‌కి కాంగ్రెస్ అధిష్టానంతో సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో ఉదయపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మేధోమథన సమావేశం తరువాత, నాయకత్వం 'కోకిల భూమి' (తన సొంత వైఖరి) లోనే ఉందని అన్నారు. కాగా ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పార్టీ తిరుగుబాటు వర్గం, విస్తృత సంస్కరణలు అవసరమని వాదిస్తున్న 'జి-23' బృందంలో కపిల్ సిబల్ సభ్యుడిగా ఉన్నారు.

సునీల్ జాఖర్ :

మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీపై విమర్శలు చేసినందుకు కాంగ్రెస్ నాయకత్వం షోకాజ్ ఇవ్వడంతో సునీల్ జాఖర్ ఈ నెలలో పార్టీని వీడి బీజేపీలో చేరారు. పార్టీని వీడి వెళ్లిన సమయంలో జాఖర్ మాట్లాడుతూ అగ్ర నాయకులు స్నేహితులెవరో, శత్రువులెవరో గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు.

హార్దిక్ పటేల్ :

తనను పార్టీ పక్కకు పెట్టిన తర్వాత గుజరాత్ నాయకుడు హార్దిక్ పటేల్ ఈ నెల ప్రారంభంలో కాంగ్రెస్ నుంచి వైదొలిగారు. ఆయన తన రాజీనామా లేఖలో రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకున్నారు. అగ్రనేతలను కలిసినప్పుడు 'మొబైల్ ఫోన్‌ల ద్వారా పరధ్యానంలో ఉన్నారని' అన్నారు. గుజరాత్ కాంగ్రెస్ పార్టీ సమస్యల కంటే నాయకులకు 'చికెన్ శాండ్‌విచ్‌లు' అందించడంలో ఎక్కువ ఆసక్తి చూపుతుందని వ్యాఖ్యానించారు.

అశ్వనీ కుమార్ :

మాజీ న్యాయ మంత్రి నాలుగు దశాబ్దాల అనుబంధం తరువాత ఫిబ్రవరిలో కాంగ్రెస్‌ను విడిచిపెట్టారు. సోనియా గాంధీకి పంపిన తన రాజీనామా లేఖలో ఈ చర్య 'నా గౌరవానికి అనుగుణంగా ఉంది' అని అన్నారు. ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ 'భవిష్యత్తులో' కాంగ్రెస్ దిగజారిపోవడాన్ని చూస్తానని తెలిపారు.

ఆర్పీఎన్ సింగ్ :

ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు ఈ కేంద్ర మాజీ మంత్రి బీజేపీలో చేరారు. తాను 32 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నానని, అయితే ఆ పార్టీ ఎలా ఉండేది ఇప్పుడు ఇక అలా ఉండదని అన్నారు. గత ఏడాది యూపీకి చెందిన మరొక ప్రముఖ నేత జితిన్ ప్రసాద బీజేపీలోకి మారిన తర్వాత ఆర్పీఎన్ సింగ్ కాంగ్రెస్‌ని వీడారు.

'పార్టీలోకి ప్రజలు వచ్చి వెళతారు'
సిబల్ నిష్క్రమణపై కేసీ వేణుగోపాల్

కొచ్చి (కేరళ) : కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ కాంగ్రెస్ నుంచి వైదొలగడంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. 'మా పార్టీలోకి ప్రజలు వస్తుంటారు, పోతుంటారు. ఈ చర్యకు ఎవరినీ నిందించలేం' అని అన్నారు. సిబల్ ఇదివరకే పార్టీ అధ్యక్షురాలికి లేఖ రాశారు. తాను కాంగ్రెస్ విలువలను దృఢంగా విశ్వసిస్తానని లేఖలో పేర్కొన్నారు. అంతకుమించి మరేమీ చెప్పలేదు. ఆయన తన వైఖరిని చెప్పనివ్వండి. అప్పుడు నేను చెప్పగలను. రాజీనామా లేఖ చాలా ఉన్నతమైనది. మా పార్టీ నుంచి ప్రజలు వస్తారు. పోతుంటారు. ఇది పెద్ద పార్టీ. కొందరు పార్టీని వీడవచ్చు. కొందరు ఇతర పార్టీలలోకి వెళ్లవచ్చు. నేను పార్టీని విడిచిపెట్టిన ఎవరినీ నిందించను. కాంగ్రెస్‌కి విస్తారమైన స్థలం ఉంది' అని వేణుగోపాల్ తెలిపారు. 'పార్టీ పూర్తిగా పునర్నిర్మించబడుతుంది. ఇది సమగ్ర పునర్వ్యవస్థీకరణతో వెళ్లాలని భావిస్తోంది. చాలా మార్గదర్శకాలు రాబోతున్నాయి. ప్రతి వ్యక్తికి ఒక పని ఉంటుంది' అని తెలిపారు. 'కేంద్రంలోని ప్రభుత్వం సీబీఐ, ఇంటెలిజెన్స్‌తో పాటు ఇతర అన్ని ఏజెన్సీలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించడం... ఏ ప్రభుత్వం కూడా ఉపయోగించని నీచమైన పద్ధతులతో ఇతర రాజకీయ పార్టీలను నిర్మూలించేందుకు కృషి చేస్తోంది. మనుగడ కష్టమే. మాకు ఆత్మవిశ్వాసం ఉంది. దీన్ని అధిగమించే శక్తి కాంగ్రెస్‌కు ఉంది. కాంగ్రెస్‌కు నాయకులు కూడా ఉన్నారు. అక్కడక్కడ తాత్కాలికంగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉంటాయి. సమస్యలపై అధ్యయనం చేస్తాం. పార్టీని బలోపేతం చేసి అద్భుతంగా ముందుకు తీసుకువెళతాం' అని కేసీ వేణుగోపాల్ చెప్పారు.

మరో రెండేళ్లు గడువు ఇవ్వండి
ఉద్గారాల కట్టడిపై పర్యావరణ శాఖకు విద్యుత్ శాఖ వినతి

న్యూఢిల్లీ : కలుష్య ఉద్గారాల కట్టడికి సంబంధించి నూతన ప్రమాణాలను అందుకునేందుకు మరో రెండేళ్ల గడువు కావాలని పర్యావరణ శాఖను కేంద్ర విద్యుత్‌శాఖ కోరింది. థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే ఉద్గారాల నియంత్రణ వ్యవస్థలను 2017లోగా ఏర్పాటు చేసుకోవాలని తొలుత డెడ్‌లైన్ విధించగా అనంతరం 2022 చివరి వరకు గడువు ఇవ్వబడింది. అయితే కోవిడ్ మహమ్మారి, దిగుమతికి సంబంధించిన ఆంక్షలు వంటి కారణాలను ప్రస్తావిస్తూ గడువును మరో రెండేళ్లు పొడిగించాలని పర్యావరణ శాఖకు కేంద్ర విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది. సల్ఫర్ డైఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించేందుకుగాను ఫ్లూ గ్యాస్ డీ సల్ఫ్యూరిసేషన్ (ఎఫ్‌జీడీ) యూనిట్లను థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అనుగుణంగా 2017లోగా ఏర్పాటు చేయాలని తొలుత స్పష్టంచేసినా అందుకు ఎదురయ్యే సవాళ్ల దృష్ట్యా 2022 వరకు గడువు పొడిగించారు. దేశ విద్యుత్ అవసరాల్లో ముప్పావు వంతును థర్మల్ విద్యుత్ కేంద్రాలు తీర్చుతుండగా వీటిలో 80 శాతం పరిశ్రమలు వినియోగించే క్రమంలో సల్ఫర్ డైఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌ల ఉద్గారాల స్థాయిని నియంత్రించే చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషవాయువులతో ఊపిరితిత్తుల వ్యాధులు, యాసిడ్ వర్షం, కాలుష్య పొగ మంచు వంటివి సంభవించే ప్రమాదం ఉంటుంది.

ముగ్గురు జైషే ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. కాగా రెదురు కాల్పుల్లో ఒక పోలీసు కూడా అమరుడయ్యాడు. బారాముల్లా జిల్లా క్రీరీ ప్రాంతంలోని నజీభట్ క్రాసింగ్ వద్ద బుధవారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కాగా పోలీసులు, భద్రతాబల గాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. చనిపోయిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ సంస్థకు చెందిన వారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభించినట్లు పోలీసులు తెలిపారు. "జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులను మట్టుబెట్టాం. వారు గత నాలుగు నెలలుగా చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారి కదలికలపై ఇప్పటివరకు నిఘా పెట్టాం. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక పోలీసు వీరమరణం పొందారు" కశ్మీర్ ఐజీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 22 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

మత్స్యకార మహిళపై సామూహిక అత్యాచారం, హత్య
- ఒడిశా వలస కూలీల ఘాతుకం
- తమిళనాడులో ఘటన... ఆందోళనకు దిగిన మత్స్యకారులు

రామేశ్వరం : ఇక్కడికి సమీపంలోని వడకాడు మత్స్యకార గ్రామంలో 45 ఏళ్ల మత్స్యకార మహిళపై ఒడిశాకు చెందిన ఆరుగురు వలస కార్మికులు అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబీకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసనకు దిగి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రామేశ్వరం జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. మంగళవారం ఉదయం సముద్రపు పాచి (కదరపసి) సేకరించేందుకు వెళ్లిన బాధితురాలు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు ఆమె గురించి వెతకగా బుధవారం ఉదయం సమీపంలోని రొయ్యల ఫారమ్‌లో మహిళ మృతదేహం పాక్షికంగా కాలిపోయినట్లు గుర్తించినట్లు వివరించారు. ఆరుగురు కూలీల ప్రమేయం గురించి తెలుసుకున్న గ్రామస్తులు వారిని కొట్టారు. అనంతరం బాధితురాలికి న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. కాగా పోలీసులు సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టిన రామనాథపురం పోలీస్ సూపరింటెండెంట్ ఇ కార్తీక్ కేసుపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వరకట్నం తీసుకోవడం నీచం: నితీశ్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వరకట్న దురాచారంపై మండిపడ్డారు. ప్రస్తుత సమాజంలో ఉనికిలో ఉన్న నీచమైన ఆచారం ఇదన్నారు. పెళ్లి కోసం వరకట్నం తీసుకోవడం పనికిమాలిన చర్య అని పేర్కొన్నారు. ఒక పురుషుడు మహిళను వివాహం చేసుకోవడం ప్రకృతి నియమం అని, దానికి వరకట్నాన్ని అంటకట్టడం సరికాదని పేర్కొన్నారు. ఒక పురుషుడు.. ఒక మహిళను మనువాడితేనే పునరుత్పత్తి అంటే సంతానం సాధ్యపడుతుంది... అదే ఒక పురుషుడిని మరో పురుషుడు పెళ్లి చేసుకుంటే పిల్లలు పుడతారా? అని ప్రశ్నించారు. పాట్నాలో మగధ మహిళా కళాశాల హాస్టల్‌ను సీఎం నితీష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వరకట్న దురాచారంపై మండిపడ్డారు. పిల్లలు పెళ్లి చేసుకుంటేనే పుడతారని అన్నారు. ఇక్కడ ఉన్నవారంతా అమ్మ కడుపు నుంచి పుట్టినవారేనని, అమ్మ లేకుండా మన ఉనికి అసాధ్యం అని తెలిపారు. మహిళలు లేకుండా మనం ఎలా పుట్టగలం? అని ప్రశ్నించారు. ఒక వేళ ఒక పురుషుడు, మరో పురుషుడిని పెళ్లి చేసుకుంటే సంతానం అనే పునరుత్పత్తి సాధ్యం అవుతుందా? అని ప్రశ్నించారు.

రైతు భార్యకు దొరికిన వజ్రం

భోపాల్: ఓ రైతు భార్యకు తాము లీజుకు తీసుకున్న గనిలో రూ.10 లక్షలు విలువ చేసే వజ్రం లభించింది. మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో ఓ గ్రామానికి చెందిన చమేలీ బాయి దంపతులు ఇటీవల కృష్ణ కళ్యాణ్‌పూర్ పతి ప్రాంతంలో నిస్సారమైన ఓ గని లీజుకు తీసుకున్నారు. చమేలీ బాయి గనిలో పని చేస్తుండగా ఈ 2.08 క్యారెట్ల వజ్రాన్ని కనుగొంది. పని చేస్తుండగా.. ఏదో మెరుస్తున్నట్లు ఆమెకు కనపించింది. తీరా ఏంటా అని చూస్తే... అది వజ్రం అని తేలింది. కాగా దొరికిన వజ్రాన్ని ఆ మహిళ మంగళవారం వజ్రాల కార్యాలయంలో డిపాజిట్ చేసినట్లు సంబంధిత అధికారి తెలిపారు. రాబోయే వేలంలో వజ్రాన్ని విక్రయానికి ఉంచుతామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధరను నిర్ణయిస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ రాయల్టీ మరియు పన్నులు మినహాయించిన తర్వాత మిగిలిన ఆదాయం మహిళకు ఇస్తారని అధికారులు చెప్పారు.

మమ్మల్ని బలిపశువుల్ని చేస్తారా?

- ఆ ముగ్గురు జర్నలిస్టుల ఆగ్రహం
- తప్పుడు కేసులు పెట్టి వేధించిన అధికారులపై చర్యలకు డిమాండు
- ప్రభుత్వ స్పందించక పోవడంపై తీవ్ర అసహనం

గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్, బల్లియా జిల్లాలో బోర్డు పరీక్షా పత్రాల లీకేజి వ్యవహారంలో అమర్ ఉజాలా కరస్పాండెంట్ అజిత్ ఓఝాతో పాటు దిగ్విజయ్ సింగ్, మనోజ్ గుప్తా అనే జర్నలిస్టులు అరెస్టు అయ్యారు. నెల రోజుల తర్వాత ఆజంఘర్ జైలు నుంచి వీరు విడుదల య్యారు. అనంతరం ది వైర్‌తో తమ చేదు అనుభవాలను పంచుకున్నారు. బల్లియా జిల్లా యంత్రాంగం తమ తప్పులను కప్పించుకునేందుకు జర్నలిస్టులను బలిపశువులను చేస్తోందని దుయ్యబట్టారు. చేయని నేరానికి శిక్షణను అనుభవించాల్సి వచ్చిందని, తప్పుడు కేసులు పెట్టి వేధించిన అధికారులపై చర్యలు తీసుకునేంత వరకు పోరాడతామని ముగ్గురు పాత్రికేయులు తేల్చిచెప్పారు.

యోగి ప్రభుత్వానికి నిజం అంటే గిట్టదని వారు వ్యాఖ్యానించారు. ఇది ఫాసిస్టు ప్రభుత్వమని, అందుకే బ్యూరోక్రాట్లు హద్దులు మీరుతున్నారన్నారు. బల్లియాలో డీఎం, ఎస్పీల నిరంకుశత్వం సాగుతోందని, బోర్డు పరీక్షల్లో విచ్చలవిడిగా మోసాలు సంస్థాగతంగా జరిగాయన్నారు. కేంద్ర నిధుల కేటాయింపు ఏకపక్షమేనని లంచాలకు కొదవ లేదని విమర్శించారు. నిజం బయటకు రాకూడదనే జర్నలిస్టులను బలిపశువులు చేస్తున్నారని ఆరోపించారు. అరెస్టుకు గురైన రిపోర్టర్లకు జర్నలిస్టులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, విద్యార్థి సంఘాలు, యువత, అనేక రాజకీయ పార్టీలు అండగా నిలవడం అసాధరణ పరిణామంగా సింగ్ అభిప్రాయపడ్డారు. తప్పుడు కేసులు బనాయించిన డీఎం, ఎస్పీపై చర్యలు తీసుకునే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు.

ప్రభుత్వం ఆ అధికారులపై చర్యలు తీసుకుంటుందని బల్లియాకు చెందిన బీజేపీ ఎంపీ వీరేంద్ర సింగ్ మస్త్ హామీ ఇవ్వడంతో ముగ్గురు జర్నలిస్టులు విడుదల తర్వాత పక్షం రోజుల పాటు ఆందోళనను విరమించుకున్నారు. నేటికీ అధికారులపై చర్యలు లేకపోవడంతో మరలా ఆందోళన బాట పడుతున్నారు.

ఈ వ్యవహారంలో రెండవ దఫా చర్చల అనంతరం తుది నిర్ణయాన్ని బహిర్గతం చేస్తామని నేషనల్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ప్రాదేశిక ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ పత్రకార్ సంఘర్ష్ మోర్చా కీలక సభ్యుడు మధుసూదన్ సింగ్ అన్నారు.

ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
ఆరుగురి సజీవదహనం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని తెహ్రీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గంగోత్రి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ బొలెరో వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు చంబా నుంచి ఉత్తరకాశీ వైపు బొలెరో వాహనం వెళుతుండగా కోటిగడ్డ సమీపంలో వాహనం అదుపు తప్పి కాలువలో పడింది. వాహనం నుంచి పెద్ద శబ్దం రావడంతోపాటు మంటలు ఎగిసిపడ్డాయి. వాహనం కాలువలో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ, వాహనంలో ఉన్నడ ప్రయాణికులు అప్పటికే పూర్తిగా కాలిపోయి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కార్తీ చిదంబరంపై ఈడీ కేసు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. 263 మంది చైనా జాతీయులకు అక్రమ వీసాలు మంజూరు చేయించిన వ్యవహారంలో కార్తీపై ఈడీ ఈ కేసు నమోదు చేసింది. ఇదే విషయంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) విచారణ చేపడుతోంది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ తాజాగా కేసు పెట్టింది. మరోవైపు, ఈ వీసా కుంభకోణం కేసులో కార్తీ చిదంబరాన్ని సీబీఐ విచారించనుంది. విచారణలో పాల్గొనాల్సిందిగా గతంలో కార్తీ చిదంబరానికి సీబీఐ సమన్లు జారీ చేసింది. బుధవారం ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు రావాలని స్పష్టం చేసింది. అయితే, బుధవారం ఉదయం కార్తీ చిదంబరం తరపు న్యాయవాది సీబీఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారని అధికారులు తెలిపారు. న్యాయవాదిని విచారించాల్సిన అవసరం లేదని, కార్తీ చిదంబరమే స్వయంగా రావాలని చెప్పి పంపినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో భోజన విరామం తర్వాత విచారణకు కార్తీ హాజరు కానున్నట్లు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. సుమారు రూ. 50 లక్షలు తీసుకుని చైనాకు చెందిన 250 మందికి కార్తీ చిదంబరం వీసాలు ఇప్పించారన్నది ప్రధాన ఆరోపణ. కార్తీ తండ్రి చిదంబరం కేంద్ర హోంమంత్రిగా ఉన్న సమయంలో ఈ వ్యవహారం జరిగిందని సీబీఐ వెల్లడించింది. 'చైనా సంస్థలోని 263 ప్రాజెక్ట్ వీసాలను గడువు ముగిసినా మళ్లీ ఉపయోగించుకునేలా చేశారు. సాధారణంగా వీసాను పునర్వినియోగించుకోవాలంటే హోంమంత్రి అనుమతి అవసరం. అప్పటి హోంమంత్రి వీటిని అనుమతించినట్లు తెలుస్తోంది. అప్పటి హోంమంత్రి చిదంబరంతో చర్చించి రూ.50 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు' అని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. దీనిపై దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. చిదంబరం సన్నిహితుడు, ఈ కేసుతో సంబంధం ఉన్న భాస్కర రామన్‌ను గత వారం అదుపులోకి తీసుకుంది. కార్తీపై ఇది మూడవ మనీలాండరింగ్ కేసు. ఇప్పటికే కొన్నేళ్లుగా ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసుల్లో కార్తీ ప్రమేయంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. కాగా తమిళనాడులోని శివగంగ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిథ్యం వహిస్తున్న కార్తీ చిదంబరం(50) తనపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. బూటకపు నేరారోపణలతో తనపై నింద మోపేందుకు కేంద్రప్రభుత్వం మరోసారి దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని చెప్పారు.

పోషకాహార లోపాన్ని నిర్మూలిస్తాం
ఎంపీ సీఎం చౌహాన్

భోపాల్: రానున్న ఒకటిన్నరేళ్లలో రాష్ట్రంలో పోషకాహార లోపం సమస్యను నిర్మూలిస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. త్వరలోనే అంగన్‌వా డీలు పిల్లల పౌష్టికాహారం, విద్యా కేంద్రాలుగా మారతాయని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 'అంగన్‌వాడీని దత్తత తీసుకోండి' కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బొమ్మలు, ఇతర అవసరమైన సామగ్రిని సేకరించే డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అశోకా గార్డెన్ ప్రాంతంలో ఈ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారు. మంత్రులు భూపేంద్ర సింగ్, విశ్వాస్ సారంగ్, ఇతర అధికారులతో కలిసి చౌహాన్ సుమారు మూడు గంటల పాటు ఆ ప్రాంతంలో పర్యటించారు. వారు 10 మినీ-ట్రక్కుల బొమ్మలు, టీవీ సెట్లు, కూలర్లు, పాత్రలు, కుర్చీలు, రగ్గులు, ఆట పరికరాలు, ఇతర వస్తువులను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ...'రాబోయే ఒకటిన్నర సంవత్సరాలలో, మధ్యప్రదేశ్ నుంచి పోషకాహార లోపం పూర్తిగా నిర్మూలించబడుతుంది... అంగన్‌వాడీలు త్వరలో రాష్ట్రంలో పిల్లల పోషణ, విద్య, సాంస్కృతిక కేంద్రాలుగా మారతాయి' అని చౌహాన్ చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల కోసం సేకరించిన వస్తువులను భోపాల్ జిల్లాలోని 1,800 అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రజానీకం దాదాపు రూ.రెండు కోట్లు విరాళాలుగా అందించారని చెప్పారు. ఈ డ్రైవ్‌కు నటుడు అక్షయ్ కుమార్, నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి, ప్రముఖ కవి కుమార్ విశ్వాస్‌తో సహా అనేక మంది ప్రముఖులు మద్దతు ఇచ్చారు. భోపాల్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రమంతటికీ స్ఫూర్తిదాయకంగా మారుతుందని చౌహాన్ అన్నారు. పుట్టిన రోజు, ఇతర వార్షికోత్సవాలు, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి పిల్లలకు భోజనం, మిఠాయిలు, పాలు, ఇతర వస్తువులు అందించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

కశ్మీర్ పండితులు అదృశ్యమవుతున్నారు

- కొన్ని రోజులకు మేమూ కనుమరుగే
- బీజేపీపై విరుచుకుపడ్డ ముఫ్తీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లోయలో కశ్మీర్ పండితులు కనిపించకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే తాము కూడా కనమరుగు అవుతామని చెప్పారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కశ్మీరీల కోసం వెతకాల్సిన సమయం ఆసన్నమైందని మెహబూబా ముఫ్తీ అన్నారు. 'మేము చిన్న వయస్సులో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో కశ్మీరీ పండితులు ఉన్నారు. కానీ ఈ రోజు నా పిల్లలు కశ్మీరీ పండితులు అంటే ఎవరు? వారు ఎలా కనిపిస్తారు? అని నన్ను అడుగుతున్నారు. ఎందు కంటే వారు అదృశ్యమవుతున్నారు. వారి సంఖ్య తగ్గింది. అలాగే మేము కూడా దృఢంగా నిలబడలేకపోతే... మా ఉనికిని కోల్పోయే అవకాశం ఉంది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ కు ప్రత్యేకహోదాపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై తీవ్ర విమర్శలు చేసిన మాజీ ముఖ్యమంత్రి... నేడు రైతుల నుండి భూములను లాక్కుంటున్నారని, ఉద్యోగాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. రాళ్లు రువ్వకపో యినా, షట్ డౌన్ పాటించకపోయినా ఇక్కడ 10 లక్షల మంది సైనికులు ఉన్నారని ఆమె చెప్పారు. ఉగ్రవాద కేసులో దోషిగా తేలిన యాసిన్ మాలిక్ విషయమై ఆమె మాట్లాడుతూ... తన తండ్రి కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు, తుపాకీని విడిచిపెట్టాలని వేర్పా టువాద నాయకుడిని కోరానని, కానీ అతను తిరస్కరిం చాడని అన్నారు. 'యాసిన్ మాలిక్ జైలులో ఉన్నారు. ముఫ్తీ సయీద్ హోంమంత్రిగా ఉన్నారు. తుపా కీని వదిలేయమని మాలిక్ కు సందేశం పంపారు. నేను హోంమంత్రిని, వీపీ సింగ్ నా స్నేహితుడు, కశ్మీరీలపై సానుభూతి ఉంది. ఆజాదీ తప్ప మీకు ఏం కావాలన్నా ఇస్తారు అని ముఫ్తీ అన్నారు'అని ఆమె అన్నారు. ప్రతిచోటా గుజరాత్ మోడల్‌ను రుద్దడానికి కేంద్రం ప్రయత్నిస్తోం దని మెహబూబా ముఫ్తీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఇవ్వడానికి ఏమీ లేదని, అందుకే మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. 'హిట్లర్' తరహాలో ముస్లింలకు వ్యతిరేకంగా ఏమైనా ఉంటే కేంద్ర ప్రభుత్వం వారికి చెప్పాలని ఆమె అన్నారు. ఇటీవల మదర్సాపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. 'ఒక పోటీ జరుగుతోంది.. గుజరాత్ మోడల్‌ను అమలు చేయాలనుకుంటున్నారా? ఉత్తరప్రదేశ్ మోడల్‌ను అమలు చేయాలనుకుంటున్నారా? లేక పోలరైజేషన్ రాజకీయాల్లో అసోం సీఎం రెండడుగులు ముందుకు సాగాలనుకుంటు న్నారా? ఈ దేశపు మూలాలను కదిలించేలా మాట్లాడుతున్నారు. రాజ్యాంగం ఇప్పుడు ప్రజల నుంచి వేరు చేయబడుతోంది' అని ముఫ్తీ తెలిపారు. 'దేశాన్ని గుజరాత్ మోడల్, ఉత్తరప్రదేశ్ మోడల్, అసోం మోడల్, మధ్యప్రదేశ్ మోడల్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముస్లింలను ఎవరు ఎక్కువగా ఇబ్బంది పెట్టాలనే విషయంలో ముఖ్యమంత్రులు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. కాబట్టి, దేవాలయాలు మసీదుల సమస్యలను లేవనెత్తారు' అని ముఫ్తీ వ్యాఖ్యానించారు.

వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు

పీఆర్సీ అమలు చేయాలి

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులేశు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

ఏపీ వైద్య విధాన పరిషత్‌లో రెగ్యులర్ ఉద్యోగులకు 11వ పీఆర్సీ అమలు చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.ఓబులేశు డిమాండ్ చేశారు. విజయవాడ–గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేశు మాట్లాడుతూ జనవరి నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ ఏపీ వైద్య విధాన పరిషత్‌లో అమలు చేయకపోవడం, ఒకటో తేదీన జీతాలు ఇవ్వకపోవడం ప్రతి నెలా ఎప్పుడు వేతనం పడుతుందో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పద్దు 010 క్రింద జీతభత్యాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామంటూ జగన్ ఇచ్చిన హామీకి మూడేళ్లవుతున్నప్పటికీ, ఇంతవరకూ రద్దు చేయలేదన్నారు. పైపెచ్చు సీపీఎస్ రద్దు చేయకుండా, జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెడతామని ప్రభుత్వం తెలపడం దుర్మార్గమన్నారు. ఈ విధానాన్ని ఉద్యోగ సంఘాలు అన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయనీ, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం జీతం చెల్లించాలని, వైద్యవిధాన పరిషత్‌లో డైటీషియన్ పదోన్నతులు కల్పించాలని, పారామెడికల్ సిబ్బందికి యూనిఫామ్, అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే, ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బాలరాజు నాయుడు, ఉపాధ్యక్షులు డి.లక్ష్మణ మూర్తి, కోశాధికారి సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కేరళలో
మహిళా ఎమ్మెల్యేల జాతీయ సదస్సు

ప్రారంభించనున్న రాష్ట్రపతి కోవింద్

తిరువనంతపురం:

మహిళా శాసనసభ్యుల జాతీయ సదస్సు ఈనెల 26న కేరళ అసెంబ్లీ కాంపెక్స్‌లో జరగబోతోంది. దీనిని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఎంపీలు, శాసనసభ్యులు ఈ సదస్సులో పాల్గోనున్నారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల క్రమంలో తొలిసారిగా ఇలాంటి సదస్సు జరగబోతోంది. రాష్ట్రపతి కోవింద్ బుధవారం రాత్రి 8.40 గంటలకు వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో కేరళ రాజధానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రాజభవన్‌కు వెళతారని అధికారిక ప్రకటన తెలిపింది. గురువారం ఉదయం సదస్సును ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం 5.20 గంటలకు పూనేకు బయల్దేరి వెళతారని పేర్కొంది. మహిళా శాసనసభ్యుల జాతీయ సదస్సు ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించడం ఇదే తొలిసారి అని స్పీకర్ ఎంబీ రాజేశ్ అన్నారు. రెండు రోజులు జరగబోయే సదస్సులో భాగంగా మహిళల హక్కులు, లింగ సమానత్వం, నిర్ణయాధికార సంస్థల్లో మహిళా ప్రాతినిధ్యం తదితర అంశాలపై చర్చించనున్నారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. 'రాజ్యాంగం–మహిళా హక్కులు' అంశంపై గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ నిమాబెన్ ఆచార్య, ఎంపీ కనిమొళి, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందా కారత్ మాట్లాడతారు. 'స్వాతంత్ర్య సమరంలో మహిళల పాత్ర' అంశంపై చర్చల్లో ప్యానలిస్టులుగా ఎంపీలు సుప్రియా సూలే, జేబీ మేథార్, మాజీ ఎంపీ సుభాషిణి అలీ వ్యవహరిస్తారు. 'మహిళా హక్కులు–చట్టపరమైన అంతరాలు 'అనే అంశంపై పశ్చిమ బెంగాల్ మంత్రి శశి పంజా, ఎంపీ జయా బచ్చన్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా, కేరళ హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్ మాట్లాడతారు. 'న్యాయనిర్ణేత సంఘాల్లో మహిళా ప్రాతినిధం' అంశంపై ఉత్తరాఖండ్ అసెంబ్లీ స్పీకర్ రితూ ఖండూరి, తెలంగాణ ఎమ్మెల్సీ కవితా కల్వకుంట్ల, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అనీ రాజా మాట్లాడతారు. వీడ్కోలు సభలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేరళ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కె.రాధాకృష్ణన్ మాట్లాడనున్నారు.

మోదీ హిందుత్వ విధానాలతో
దేశ భద్రతకు ప్రమాదం

మోదీ 'భార'తం ప్రత్యేక వ్యాసాల సంచిక ఆవిష్కరణలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

కేంద్రంలోని మోదీ హిందుత్వ, ఫాసిజం, కార్పొరేట్ విధానాలతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని, వాటిని తిప్పికొట్టాల్సిన అవసరముందని ప్రముఖ వ్యాసకర్తలు నొక్కిచెప్పారు. ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్–విజయవాడ నిర్వహణలో జూమ్ ద్వారా మోదీ 'భార'తం ప్రత్యేక వ్యాసాల సంచికను బుధవారం ఆవిష్కరించారు. సమావేశానికి జాతీయ స్ఫూర్తి సంపాదకులు, విశ్లేషకులు డీవీఎస్ వర్మ అధ్యక్షత వహించారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి ఈ ప్రత్యేక సంచికను ఆవిష్కరించి, మోదీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు అంశంపై ప్రసంగించారు. మోదీ పాలనలో దేశానికి మూల స్థంభాలయిన పార్లమెంటు, ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ, మీడియా నాలుగు రంగాలు బలహీన పడ్డాయని, అవి ప్రమాదకర స్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే ధోరణి కొనసాగిస్తే మన దేశం భ్రష్టు పట్టిపోతుందన్నారు. పార్లమెంట్‌లో చర్చలు కొనసాగడం లేదనీ, రాష్ట్రాల ముఖ్యమంత్రులు గుడ్డి ధోరణితో వ్యవహరిస్తూ కేంద్రం తెచ్చే బిల్లులకు మద్దతిస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిపై సీబీఐతో దాడులుంటాయనీ, దేశంలో ప్రజలు నిరసన తెలిపే హక్కును సైతం కోల్పోతున్నారని, మోదీ నుంచి ఏపీ సీఎం జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్ వరకు ముగ్గురూ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. వారి విధానాలు మారకుంటే, ఓటు హక్కు ద్వారానే గుణపాఠం చెప్పాలని సూచించారు.

విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు 'మోదీ పాలనలో విభజన రాజకీయాలు' అంశంపై ప్రసంగిస్తూ నాటి గుజరాత్ సీఎం దగ్గర నుంచి నేటి ప్రధాని వరకు మోదీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలను విశ్లేషించారు. గుజరాత్ అల్లర్లు, సిక్కుల ఊచకోతల తదితర ఘటనలను మత కలహాలుగా చిత్రీకరించారన్నారు. దేశంలో ప్రస్తుతం మత కలహాలు తగ్గినప్పటికీ, మతంరాజ్యం ఏలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ మైనార్టీ వర్గాలను ద్వేషించడం, ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా ద్వేషించడం మోదీ ప్రభుత్వానికి సర్వసాధారణమైందన్నారు. మైనార్టీలను అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. మతం, లింగం భేదపరమైన వివక్షలు ఆందోళన కలిగిస్తున్నాయనీ, దేశంలో దళితుల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దేశంలో చాలా రాజకీయ పార్టీలు మతం పేరిట పాలిస్తున్నాయనీ, విద్వేషాలు, మత దురంహకారాలకు అదుపు లేకుండా పోయిందన్నారు. మతంతో ఎనిమిదేళ్ల మోదీ పాలన, మారని గాయంగా మారిందని చెప్పారు. ప్రముఖ వ్యాసకర్త ఎం.కోటేశ్వరరావు 'హిందుత్వ మార్కు ఆర్థిక విధానాల నిజ స్వరూపం' అంశంపై ప్రసంగిస్తూ, మోదీ ఈ ఎనిమిదేళ్ల పాలనలో దేశాన్ని అన్ని రంగాల్లోనూ దిగజారిచ్చారని విమర్శించారు. సామాజిక మాధ్యమాల ద్వారా మత విద్వేషాలను జనంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తూ, మోదీ ప్రభుత్వం విజయం సాధిస్తుందన్నారు. ప్రముఖ చరిత్ర పరిశోధకులు కొప్పర్తి వెంకట రమణమూర్తి 'చరిత్ర వక్రీకరణ దేనికోసం?' అంశంపై ప్రసంగిస్తూ చరిత్రను తనకు అనుకూలంగా మరల్చడం, వక్రీకరించడం ఫాసిజం లక్షాలనీ, వాటిని దేశంలో మోదీ ప్రభుత్వం వేగంగా అనుసరిస్తోందన్నారు. ప్రముఖ సంపాదకులు, వ్యాసకర్త ఎన్.వేణు గోపాల్ 'మన్యం ముసుగులో ఫాసిజానికి అడుగులు' అంశంపై ప్రసంగిస్తూ, గుజరాతీ సంస్కృతిని దేశ వ్యాప్తంగా బలవంతంగా రుద్దేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. సాంస్కృతిక జాతీయ వాదం నుంచి 40ఏళ్ల పయనంలో బుల్డోజ్ జాతీయ వాదానికి వచ్చిందనీ, ఇది ఫాసిజంలో ఒక భాగమని వివరించారు. ఆయా దేశాలకు అనుగుణంగా ఫాసిజం రూపం మార్చుకుంటోందన్నారు. తొలుత ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు ప్రారంభోపన్యాసం చేస్తూ, ఎనిమిదేళ్లుగా ప్రోగ్రెసివ్ ఫోరమ్ వివిధ అంశాలపై చేస్తున్న కార్యక్రమాల్ని వివరించారు. ప్రముఖులు రాసిన ఈ వ్యాసాల సంకలనం ప్రజలకెంతో తోడ్పడుతుందన్నారు. మోదీ ఎనిమిదేళ్ల పాలనలో హిందుత్వ విధానం, ఆర్థిక విధానాలపై ఈ సంచికలో సమగ్రంగా వ్యాసాలున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు బుడ్డిగ జమిందార్, అభ్యుదయ వాదులు, సాహితీ వేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

అనంతబాబుపై వైసీపీ వేటు

- వామపక్ష, ప్రజా సంఘాల ఉద్యమ ప్రభావం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు ఎమ్మెల్సీ అనంతబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. అనంతబాబును వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం మరణానికి తానే బాధ్యుడిని అని ఎమ్మెల్సీ అనంతబాబు తమకు వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు ప్రకటించిన నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. డ్రైవర్ హత్య కేసులో అనంతబాబును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టు అతనికి రిమాండ్ విధించడంతో రాజమండ్రి జైలుకు తరలించిన విషయం విదితమే. అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2వ తేదీన చలో రాజ్‌భవన్‌కు వామపక్ష, దళిత, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. ఇప్పటికే అనంతబాబు అరెస్టుపై కాకినాడ కేంద్రంగా పెద్దఎత్తున వామపక్ష పార్టీలు, డీహెచ్‌పీఎస్ తదితర సంఘాలతో పెద్దఎత్తున పోరాటం కొనసాగించాయి. ఆ మేరకు పోలీసులు స్పందించి అనంతబాబును అరెస్టు చేశారు. అనంతబాబు అరెస్టుతోను, పార్టీ నుంచి సస్పెన్షన్లతోనే సరిపెట్టకుండా ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణల పైన సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నాయి.

మహానాడుకు భారీ ఏర్పాట్లు

- ఫ్లెక్సీలను తొలగిస్తున్న అధికారులు
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- నేడు ఒంగోలుకు చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో–ఒంగోలు:

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మహానాడుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఒంగోలులో జరగనున్న మహానాడు ఏర్పాట్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, యనమల రామకృష్ణుడు బుధవారం పరిశీలించారు. మహానాడు సందర్భంగా ఒంగోలు నగర పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, తోరణాలను మునిసిపల్ అధికారులు తొలగించడంపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన కలెక్టరేట్ వద్ద టీడీపీ తోరణాలను అధికారులు తొలగిస్తున్న సందర్భంలో టీడీపీ కార్యకర్తలు, అధికారుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. గతంలో టీడీపీ సభా ప్రాంగణానికి అనుమతి లేకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్న విషయం విదితమే. మరోసారి ఫ్లెక్సీలను కూడా కట్టనీయకుండా మునిసిపల్ అధికారులు అడ్డుపడటంతో ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునేందుకు కమిషనర్‌ను అనుమతి కోరినా ఇవ్వకపోగా ప్రస్తుతం ఉద్దేశపూర్వకంగా కట్టిన వాటిని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు.

వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారులపై ఒత్తిడి తెచ్చి మహానాడును అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. తొలిరోజు 13 వేల మందితో ప్రతి నిధుల సభ జరగనున్నది. మహానాడు సందర్భంగా గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంగోలుకు రానున్నారు. సాయంత్రం ఒంగోలులో పొలిట్ బ్యూరో సమావేశాన్ని నిర్వహించనున్నారు. చంద్రబాబు రాక సందర్భంగా భారీ స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, యనమల రామకృష్ణుడు, పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్, పర్చూరు, అద్దంకి, కొండేపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర సమన్వయకర్త దామచర్ల సత్య, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో టెక్నాలజీతో ఆసుపత్రుల అభివృద్ధి

బెంగళూరు: దేశంలోని కొన్ని ఆసుపత్రులు అత్యవసర ఆరోగ్య సంరక్షణ కోసం క్రిటికల్ కేర్ డిపార్ట్ మెంట్‌లను అంతరిక్ష సాంకేతికతలతో అప్‌గ్రేడ్ చేసుకుంటున్నాయి. ఇదంతా భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) సహకారంతో జరుగు తోంది. ఇస్రో పరిజ్ఞానంతో చెన్నైలోని డాక్టర్ మెహతా ఆసుపత్రి, బెంగళూరులోని నారాయణ హెల్త్ సిటీలో నిర్వహించిన అధ్యయనాలు సానుకూల ఫలితాలివ్వడం హర్షణీయమని ఇస్రో పేర్కొంది. ఇస్రో పరిజ్ఞానం ద్వారా మరింత ప్రయోజనం పొందేందుకు కీలక శాఖల్లో సేవలను విస్తరించేందుకు హెల్త్–క్వెస్ట్ (క్వాలిటీ అప్‌గేడేషన్ ఎనేబుల్డ్ త్రూ స్పేస్ టెక్నాలజీ) అధ్యయనాలను దేశంలోని ఎంపిక చేసిన 11 ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్నట్లు తాజా ప్రకటనలో వెల్లడించింది. ఆ ఆసుపత్రులు ఏవన్నది మాత్రం తెలపలేదు. మరణాలను తగ్గించేందుకు అత్యద్భుత సేవల కోసం 2016లో అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఇండియా, ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, కాన్సార్టియం ఆఫ్ ఎక్రిడిటేడెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్ తమను ఆశ్రయించినట్లు ఇస్రో ప్రకటన తెలిపింది.



గ్రీన్‌టెక్‌కు ప్రపంచదేశాల ఆదరణ

55కు పెరిగిన భాగస్వామ్య కంపెనీలు సంఖ్య

దావోస్:

హరిత సాంకేతికకు ప్రపంచ దేశాల ఆదరణ లభిస్తోంది. స్విట్జర్లాండ్, దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశం సందర్భంగా గ్రీన్‌టెక్‌లో భాగస్వామ్యానికి అనేక కంపెనీలు ముందుకొచ్చాయి. ఈపరిజ్ఞానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో భాగస్వామ్యాన్ని విస్తరిస్తున్నట్లు ప్రపంచ ఆర్థిక ఫోరంతో పాటు వ్యాపార దిగ్గజ వర్గాలు ప్రకటించాయి. గ్రీన్ స్టీల్, గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ కాప్చర్ వంటి టెక్నాలజీలను, పెట్టుబడులనూ పెంచుతూ మార్కెట్‌కు సంకేతాలిస్తున్నాయి. అమెరికా వాతావరణ రాయబారి జాన్ కెర్రీతో పాటు బిల్ గేట్స్, సేల్స్‌ఫోర్స్ కో–సీఈవో మార్క్ బిన్యాఫ్, గూగుల్ సీఎఫ్‌ఓ రుత్ పోరట్‌తో పాటు అనేక వ్యాపార దిగ్గజాలు గ్రీన్ టెక్నాలజీస్ కొనుగోలుకు సై అనడంతో భాగస్వామ్య కంపెనీల సంఖ్య 30 నుంచి 55కి పెరిగింది. అమెరికా, డబ్ల్యూఈఎఫ్ దీనికి శ్రీకారం చుట్టగా స్వీడన్, భారత్, డెన్మార్క్, బ్రిటన్ తదితర దేశాలు భాగస్వాములుగా చేరాయి. అనేక 'హరిత' ఉత్పత్తులపై ప్రీమియం ధరలు ఉన్నాయని బిల్‌గేట్స్ అన్నారు. ధరలు తగ్గాలంటే ఉత్పత్తి పెరగాలన్నారు. కాగా, పారిశ్రామికీకరణకు ముందు ఉష్ణోగ్రత స్థాయి 1.5 డిగ్రీల సెల్సియస్ (2.7ఫారిన్‌హీట్) ఉండాలంటే కర్బన ఉద్గారాలను ఈ దశాబ్దంలో గణనీయంగా తగ్గించడం ఎంతైనా అవసరమని ప్రపంచలోనే ప్రఖ్యాత వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

రష్యా విద్యుత్ కొనం..: ఉక్రెయిన్ కంపెనీ

ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధ పరిస్థితుల క్రమంలో ఆ దేశం నుంచి విద్యుత్‌ను కొనే పరిస్థితి లేదని ఉక్రెయిన్‌కు చెందిన అతిపెద్ద ప్రైవేటు విద్యుత్ కంపెనీ సీఈవో ప్రకటించారు. తాను ఇంచార్జిగా ఉన్నంత వరకు రష్యా నుంచి విద్యుత్ కొనే పరిస్థితి ఉండదని తేల్చిచెప్పారు. రష్యా చమురు, సహజ వాయువుపై అమితంగా ఆధారపడేలా చేసిన తప్పిదాన్ని సరిచేయాల్సిన బాధ్యత యూరోపియన్ యూనియన్‌పై ఉందన్నారు. డీటెక్ గ్రూపుకు చెందిన మాక్సిమ్ టించెకో మాట్లాడుతూ, రష్యా దాడుల క్రమంలో ఉక్రెయిన్‌లో తమ సేవల వినియోగం 35శాతం మేర తగ్గిందని, కావాల్సిన అదనపు విద్యుత్‌ను యూరప్ నుంచి కొనుగోలు చేయొచ్చు అని అన్నారు. ఈయూ గ్రిడ్‌తో అనుసంధానాన్ని తమ కంపెనీ కలిగివుందని, అది అత్యవసర పరిస్థితుల కోసమేనన్నారు. తమ విద్యుత్ వ్యవస్థ ఆర్థిక సుస్థిరతకు మద్దతిచ్చేందుకు ఉక్రెయిన్‌కు ఆదాయం అవసరమన్నారు.

మా భూమిని వదులుకోం..: జెలెన్‌స్కీ

రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు తమ భూభాగాన్ని వదులుకునేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. ఆయన బుధవారం వీడియో లింక్ ద్వారా దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో ఏం జరుగుతుందో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు పూర్తిస్థాయిలో అర్థమైనట్లు లేదని అభిప్రాయపడ్డారు. యుద్ధాన్ని ముగించేందుకు రాజీ పడతారా అని సీఎన్ఎన్ విలేకరి ప్రశ్నించగా తమ భూమిని వదులుకోవాల్సి వస్తే రాజీ ఉండదని, తాము పోరాడుతున్నది దేశం కోసమేనని జెలెన్‌స్కీ సమాధానం చెప్పారు. ఈ యుద్ధం జరుగుతున్నది మా భూభాగం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భవితవ్యం కోసమని నొక్కిచెప్పారు. దౌత్యానికి–చర్చలకు రష్యా సంసిద్ధతను కనబర్చాలని, కనీసం బలగాలను ఉపసంహరించుకోవడం వంటి చర్యలను తీసుకోవాలని ఆయన అన్నారు.

పేద దేశాలకు వాక్సిన్‌లిస్తాం..: ఫైజర్

ప్రపంచంలోనే అత్యంత పేద దేశాలకు కనీస ధరలకు కోవిడ్ వాక్సిన్‌లతో పాటు రెండు డజన్ల ఉత్పత్తులను అందిస్తామని ఫైజర్ ప్రకటించింది. 45 పేద దేశాల్లో ఆరోగ్య సంరక్షణ పరిస్థితి మెరుగుదలే తమ లక్ష్యమని తెలిపింది. పేద దేశాల్లో చాలా వరకు ఆఫ్రికాలో ఉండగా ఈ జాబితాలో హైతి, సిరియా, కొంబోడియా, ఉత్తర కొరియా ఉన్నాయని పేర్కొంది. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లో ఇన్ఫెక్షన్‌లకు సంబంధించి 23 ఔషధాలు, వాక్సిన్‌లు, క్యాన్సర్ మందులు, అరుదైన రోగాలకు మందులు విస్తృతంగా లభిస్తాయని, వీటితో పోల్చితే 45 పేద దేశాల్లో చాలా తక్కువ మందులు అందుబాటులో ఉన్నాయని కంపెనీ అధికార ప్రతినిధి పామ్ ఐసెలే అన్నారు. న్యూయార్క్‌కు చెందిన ఫైజర్ కంపెనీ కనీస సరఫరా చార్జీలు, ధరలకు మందులను ఆ దేశాలకు అందించేందుకు సిద్ధంగా ఉందని, ఈ క్రమంలో ఆంక్షలు, చట్టాలను పరిగణనలోకి తీసుకుంటుందని ఆమె చెప్పారు. కోవిడ్ చికిత్సను పేద దేశాలకూ విస్తరింపజేయాలని ఫైజర్‌కు డబ్ల్యూహెచ్‌ఓ ఇటీవల పిలుపు ఇవ్వడం విదితమే.

క్రీడాకారులు రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపచేయాలి

ఖేలో ఇండియా కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

విశాలాంధ్ర–విజయవాడ స్పోర్ట్స్:

జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ తరపున పాల్గొనే క్రీడాకారులు రాణించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధ్వర్యంలో నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వీరతిలకం దిద్దినాము–విజయులై తిరిగిరండి' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రం నుంచి 19 విభాగాల్లో 160 మంది క్రీడాకారులు హరియాణాలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కి ఎంపిక కావడం గర్వకారణమని, ఏపీ క్రీడాచరిత్రలో శుభపరిణామమని తెలిపారు. వేదికపై బాక్సింగ్, త్యంగ్–టా, టేబుల్ టెన్నిస్ ఆటలను మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. బ్రెజిల్‌లో నిర్వహించిన 2021 డెఫ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన షేక్ జఫ్రీన్‌ను మంత్రి, శాప్ చైర్మన్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మూడవ జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్–2022 పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులు డెమోలను ప్రదర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన క్రీడాకారుల మల్లఖాంబ్ ఆట ప్రత్యేక ప్రదర్శనగా ఆకట్టుకుంది. ఖేలో ఆంధ్రా, జయహో ఆంధ్రా అని నినాదాలు మార్మోగాయి. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులందరూ ఖేలో ఇండియాలో పతకాలు సాధిస్తే తమకు ఎంతో ఆనందమన్నారు. మీరంతా ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడికి గుర్తింపు పెరగాలనే లక్ష్యంతో సీఎం కప్, శాప్ లీగ్స్, సమ్మర్ క్యాంపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో శాప్ కార్యాలయం కూడా ఎవరికీ తెలిసేది కాదని, ఇప్పుడు నేరుగా వచ్చి కలిసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రపంచంలో క్రీడాకారులకు ఉన్నంత క్రేజ్ మరెవరికీ ఉండదన్నారు. అయితే శ్రమపడకుండా ఏ ఒక్కరూ రాత్రికి రాత్రే ఎవరూ స్టార్ అయిపోరని గుర్తించాలని సూచించారు. డెఫ్ ఒలింపిక్స్‌లో షేక్ జఫ్రీన్ పతకం సాధించడం వెనుక కష్టాన్ని అందరూ గుర్తించాలని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనకు స్ఫూర్తి అని తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులందరూ 'మీ కష్టం మీరు చేయండి.. మీ భవిష్యత్తుకు మాది బాధ్యత' అని అభయం ఇచ్చారు. ఖేలో ఇండియాలో సర్టిఫికెట్ తీసుకున్నవారికి తగిన న్యాయం చేసే విధంగా స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. శాప్ టోల్ ఫ్రీ నంబర్ తీసుకొచ్చామని, ఎవరికి ఏ సమస్య ఉన్నా చెప్పవచ్చని చైర్మన్ తెలిపారు.

డెఫ్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత షేక్ జఫ్రీన్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి అనేక సవాళ్లను దాటుకుని అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం చాలా ఆనందంగా ఉందని, మరిచిపోలేని అనుభూతి అన్నారు. తన తండ్రి, కుటుంబం నుంచి లభించిన ప్రోత్సాహం, మద్దతు మాటల్లో చెప్పలేనిదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, శాప్ బోర్డు సభ్యులు, శాప్ స్పోర్ట్స్ అధికారి ఎ.మహేష్‌బాబు, పరిపాలనాధికారి ప్రత్తిపాటి రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్, రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్‌కి చెందిన డాక్టర్ డి.దుర్గాప్రసాద్, రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి యు.వి.రాఘవులు, వివిధ క్రీడా సంఘాల సభ్యులు, కోచ్‌లు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా భీమవరం విద్యార్థుల మల్లఖాంబ్

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విద్యార్థులు చేసిన మల్లఖాంబ్, రోప్ స్కిప్పింగ్ చూపరులను కట్టిపడేశాయి. మల్లఖాంబ్ మధ్యప్రదేశ్‌కి చెందిన క్రీడ అని, వీటిలో పోల్ మల్లఖాంబ్, రోప్ మల్లఖాంబ్ అని రెండు రకాలు ఉంటాయని కోచ్ జీపీసీ శేఖర్ రాజు తెలిపారు. కోచ్ శేఖర్ రాజుకి మంత్రి, శాప్ చైర్మన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. మల్లఖాంబ్ వంటి క్రీడల ప్రోత్సాహానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడల్లో ఎక్కువ ఆసక్తి కనబరుస్తారన్నారు. మల్లఖాంబ్ క్రీడాకారులతో మంత్రి రోజా సెల్ఫీ తీసుకున్నారు.

ఖేలో ఇండియా క్రీడాంశాల జాబితా

హరియాణాలో జరిగే నాల్గవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2021లో అండర్–17 కేటగిరీ బాలురు, బాలికల విభాగంలో 160 మంది క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ నుంచి 19 విభాగాల్లో ఎంపికయ్యారు. ఈ యూత్ గేమ్స్‌లో గట్కా, మల్లఖాంబ్, త్యంగ్–ట అనే మూడు కొత్త విభాగాలు నిర్వహించనున్నారు. మొత్తం 24 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు 19 విభాగాల్లో ఎంపిక అయ్యారు. ఆర్చెరీ నుంచి ఆరుగురు, అథ్లెటిక్స్ ఐదుగురు, బ్యాడ్మింటన్ ఒకరు, బాక్సింగ్ 12 మంది, సైక్లింగ్ ఇద్దరు, గట్కా 16 మంది, జిమ్నాస్టిక్స్ ఒకరు, హ్యాండ్ బాల్ 16 మంది, జూడో 9 మంది, కబడ్డీ 24 మంది (పురుషులు, స్త్రీలు), ఖోఖో 12 మంది, మల్లఖాంబ్ 12 మంది, షూటింగ్ ఇద్దరు, స్విమ్మింగ్ ఆరుగురు, టేబుల్ టెన్నిస్ ఇద్దరు, టెన్నిస్ ఒకరు, త్యంగ్–ట ఐదుగురు, వెయిట్ లిఫ్టింగ్ 22 మంది, రెజ్లింగ్ ఆరుగురు ఎంపికయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.